


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 364, పేజీలు - 08

మంగళవారం, జూన్ 23, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## తెలంగాణ కాంగ్రెస్ ప్రక్షాళన.?

- మీనాక్షి ఇష్యూతో తెలంగాణ కాంగ్రెస్‌లో టైం బాంబ్
- సమగ్ర ప్రక్షాళనకు రాహుల్ రెడీ
- ఎవరు బలి కాబోతున్నారు?





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మధ్యప్రదేశ్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత, ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ అనూహ్యంగా తిరస్కరణకు గురికావడం ఇప్పుడు జాతీయ రాజకీయాలతో పాటు తెలంగాణ కాంగ్రెస్‌లో తీవ్ర కలకలం రేపుతోంది. హైదరాబాద్ కోర్టులో ఉన్న ఒక పాత కేసుకు సంబంధించిన సమాచారాన్ని నామినేషన్ అఫిడవిట్‌లో దాచారనే నెపంతో ఆమె ఫామ్‌ను తిరస్కరించడం, దీనిపై సుప్రీంకోర్టు కూడా జోక్యానికి నిరాకరించడం కాంగ్రెస్ అధిష్ఠానానికి పెద్ద షాక్. అయితే, మధ్యప్రదేశ్‌లో జరిగిన ఈ పొలిటికల్ డ్రామా వెనుక తెలంగాణ కాంగ్రెస్‌కు చెందిన కొందరు కోవర్టుల హస్తం ఉందనే సమాచారం వెలుగులోకి రావడం ఇప్పుడు రాహుల్ గాంధీ ఆగ్రహానికి కారణమైంది.

### మధ్యప్రదేశ్‌లో నామినేషన్ రిజెక్షన్.. కదిలిన తెలంగాణ లింక్!

రాహుల్ గాంధీ కోటరీలో అత్యంత నమ్మకస్తురాలైన మీనాక్షి నటరాజన్‌ను మధ్యప్రదేశ్ నుండి రాజ్యసభకు పంపాలని కాంగ్రెస్ హైకమాండ్ భావించింది. అయితే, ఆమె నామినేషన్‌పై బీజేపీ అభ్యర్థి మహేష్ కేవట్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ తెలంగాణలోని హైదరాబాద్ కోర్టులో ఉన్న ఒక ప్రైవేట్ కంప్లైంట్ వివరాలను అఫిడవిట్‌లో దాచారని రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో జూన్ 9న ఆమె నామినేషన్ తిరస్కరణకు గురైంది. అయితే, అసలు మధ్యప్రదేశ్‌లో ఉన్న బీజేపీ నేతలకు తెలంగాణ కోర్టులో మీనాక్షి నటరాజన్‌పై ఆమె ఏఐసీసీ ఇన్‌చార్జ్‌గా ఉన్న కాలానికి సంబంధించి ఉన్న కేసు వివరాలు, నోటీసుల కాపీలు ఎలా దొరికాయనే దానిపై దర్యాప్తు చేయగా షాకింగ్ విషయాలు బయటపడ్డాయి.

### అంతర్గత కుట్ర.. లీక్ చేసింది సొంత పార్టీ నేతలేనా?

ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. బీజేపీ సీనియర్ మంత్రి కైలాష్ విజయవర్గీయ సైతం కాంగ్రెస్‌లోని అంతర్గత విభేదాల వల్లే తెలంగాణ నుండి సమాచారం లీక్ అయింది అని వ్యాఖ్యానించడం కాంగ్రెస్ అనుమానాలకు బలమిచ్చింది. మీనాక్షి నటరాజన్ తెలంగాణ ఇన్‌చార్జ్‌గా వచ్చిన తర్వాత పార్టీలోని కొందరు సీనియర్ల ఏకపక్ష నిర్ణయాలకు, గ్రూపు రాజకీయాలకు అడ్డుకట్ట వేశారు. ఈ క్రమంలో ఆమెపై కక్ష పెంచుకున్న తెలంగాణ కాంగ్రెస్‌కు చెందిన ఒక గ్రూపు ఆమెను రాజ్యసభకు వెళ్లకుండా

2లో..

## అమెరికాతో ట్రేడ్ డీల్ వద్దు

- మా పొట్ట కొట్టొద్దని ప్రధాని మోదీకి లేఖ



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారత్- అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చల నేపథ్యంలో హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, ఉత్తరాఖండ్ లోని యాపిల్ పంటను సాగు చేసే రైతులు ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఈ మేరకు వ్యవసాయ ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను తగ్గించే ఏ నిర్ణయంపైనా అంగీకారం తెలపొద్దని దానివల్ల రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయని లేఖలో స్పష్టం చేశారు. జూన్ 23 మంగళవారం నుంచి అమెరికాతో మినిస్టీరియల్ లెవెల్ లో చర్చలు ప్రారంభం కానున్నట్లు సమాచారం అందుతున్న నేపథ్యంలో యాపిల్, ఆల్ మండ్స్, వాల్ నట్స్, ఇతర దేశీయ హార్టికల్చర్ పంటలను పండించే రైతులు ఈ మేరకు ప్రధాని మోదీకి లేఖ రాశారు.
హిల్ స్టేట్ హార్టికల్చర్ ఫోరమ్ ఈ మేరకు భారత్- అమెరికా ఒప్పందంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఈ డీల్ కారణంగా రైతుల ప్రయోజనాలు, హార్టికల్చర్ దెబ్బతింటుందని అభిప్రాయపడుతున్నాయి. " గత కొన్ని నెలలుగా అమెరికాలోని ప్రతినిధులు భారత్ లోని వ్యవసాయ మార్కెట్ పై

2లో..

## అశ్విని వైష్ణవ్‌తో రేవంత్, కిషన్ రెడ్డి భేటీ

- నేడు ఖట్టర్‌తో సమావేశం తర్వాత మెట్రోపై క్లారిటీ!



**న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ అభివృద్ధి, ముఖ్యంగా భాగ్యనగర జీవనాడి అయిన హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 ప్రాజెక్టు చుట్టూ సాగిన పొలిటికల్ హైడ్రామాకు దేశ రాజధాని ఢిల్లీ వేదికగా ఒక అనూహ్యమైన ముగింపు లభించింది. నిన్నమొన్నటి వరకు మెట్రో నిధుల విషయంలో పరస్పరం తీవ్ర విమర్శలు, సవాళ్లు విసురుకున్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి రాజకీయ విభేదాలను పక్కనబెట్టి చివరకు ఒక్కటిగా వెళ్లి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలవడం హాట్ టాపిక్‌గా మారింది. రెండు విభిన్న ధృవాల లాంటి పార్టీలకు చెందిన ఇద్దరు అగ్రనేతలు రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీ వీధుల్లో చేతులు కలపడం ఆసక్తికరంగా మారింది. ఈ అరుదైన భేటీ వెనుక పెద్ద రాజకీయం మరియు లేఖల యుద్ధమే నడిచింది. హైదరాబాద్ మెట్రో రెండో దశకు కేంద్రం నిధులు ఇవ్వకుండా కిషన్ రెడ్డే

2లో..

## నేను కేసీఆర్ అంత మంచోడిని కాదు

### చిట్టినాయుడు అండ్ టీంకి సినిమా చూపిస్తా

- ప్రత్యర్థులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన కేటీఆర్
- మా కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని వదిలిపెట్టేది లేదని స్పష్టీకరణ
- సప్తసముద్రాలు దాటినా వెతికి పట్టుకొస్తానని శపథం

2లో..



## ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయి

### జాగ్రత్తగా ఉండాలని అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం

- కొన్ని పార్టీలు ప్రతి అంశానికి కుల, మత రంగు పులుముతున్నాయని ఆరోపణ
- ప్రజా సమస్యల పరిష్కారంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచన
- ఉద్యోగులు, అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలోని కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న కుట్రల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. ప్రతి సంఘటనకు కుల, మత రంగు పులిమి, వివాదాస్పదం చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు దుష్ప్రచారం, తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖల పనితీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ విద్వేషాలను

2లో..



## మూడు 'ఎస్' లే మా బలం

### మీడియా కాంక్లేవ్‌లో మంత్రి లోకేశ్

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పారిశ్రామికవేత్తలు ఆంధ్రప్రదేశ్ వైపు మొగ్గు చూపడానికి వేగం (స్పీడ్), స్థిరత్వం (స్టెబిలిటీ), సేవ (సర్వీస్) అనే మూడు "ఎస్"లే ప్రధాన కారణమని, అవే తమ ప్రభుత్వ విజయ రహస్యాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో ఓ మీడియా సంస్థ నిర్వహించిన కాంక్లేవ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రిపబ్లిక్ టీవీ చీఫ్ ఎడిటర్ ఆర్నబ్ గోస్వామి అడిగిన పలు ప్రశ్నలకు లోకేశ్ సూటిగా, స్పష్టంగా సమాధానాలిచ్చారు. ఏపీ అభివృద్ధి ప్రణాళిక, తమ ప్రభుత్వ ప్రాధాన్యతలను జాతీయ వేదికపై సమగ్రంగా వివరించారు.

### ఆర్నబ్ గోస్వామి ప్రశ్నలు - లోకేశ్ సమాధానాలు

ఈ చర్చను ఆర్నబ్ గోస్వామి తన పాత జ్ఞాపకాలతో

2లో..

## మాఫియాను అడ్డుకున్నందుకు లారీతో తొక్కించారు?

### లారీ ఢీకొని డీటీఓ మృతి

- డీటీఓ వెంకన్నను వేగంగా ఢీకొన్న టిప్పర్
- ఆర్టీఓ కార్యాలయం ఎదుటే ఘటన
- అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన వెంకన్న
- డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ప్రమాదమా.? లేక బొగ్గు మాఫియా కక్షసాధింపా.?





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** విధినిర్వహణలో నిమగ్నమైన ఒక నిజాయితగల అధికారి మృత్యువు ఒడికి చేరుకున్నారు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సోమవారం ఉదయం ఒక అత్యంత దారుణమైన రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రభుత్వ విధుల్లో భాగంగా రోడ్డుపై వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీఓ) బి. వెంకన్న (45) ను ఒక బొగ్గు టిప్పర్ లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ షాకింగ్ ఘటన జిల్లా అధికార యంత్రాంగాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటన సాధారణ రోడ్డు ప్రమాదమా, లేక అక్రమ రవాణా మాఫియా పన్నిన కుట్రా అనేది తెలియాల్సిఉంది.
వివరాల్లోకి వెళితే గణపురం మండలం చెల్పూర్ శివారులోని ప్రాంతీయ రవాణా శాఖ (ఆర్టీఓ) కార్యాలయం ఎదుట, ఆర్డీవో ఆఫీస్ సమీపంలో డీటీఓ వెంకన్న తన సిబ్బందితో కలిసి ఉదయం రెగ్యులర్ వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల నుండి బొగ్గు లోడ్‌తో పరకాల వైపు అతివేగంగా దూసుకొచ్చిన ఒక టిప్పర్ లారీ అదుపుతప్పి వెనుక నుంచి నేరుగా వెంకన్నపైకి దూసుకెళ్లింది. లారీ వేగానికి డీటీఓ వెంకన్న శరీరం పూర్తిగా నుజ్జునుజ్జయి రోడ్డుపై పడిపోయింది. కళ్లెదుటే జరిగిన ఈ ఘోర ప్రమాదాన్ని చూసి తోటి రవాణా శాఖ సిబ్బంది, స్థానికులు తీవ్ర షాక్‌కు లోనయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భూపాలపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.
మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలానికి చెందిన వెంకన్న గతంలో జగిత్యాల జిల్లాలో పనిచేశారు. అక్కడి నుండి కేవలం 15 నుండి 20 రోజుల క్రితమే ఆయన భూపాలపల్లి జిల్లాకు బదిలీపై వచ్చి డీటీఓగా బాధ్యతలు స్వీకరించారు. కొత్తగా విధుల్లో చేరిన కొన్ని రోజుల్లోనే ఆయన ఇలా రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడం ఆ కుటుంబంలో కోలుకోలేని విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ప్రమాదంపై సమగ్ర విచారణకు ఆదేశించారు. ఇక ఈ ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. భూపాలపల్లి డీటీఓ వెంకన్న మృతి పైన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంకన్న కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్‌ను రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## పురుషుల్లో మద్యపానం, మహిళల్లో ధూమపానం

- ఆరోగ్య సర్వేలో ఆందోళనకర విషయాలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశంలో ప్రజారోగ్య ముఖచిత్రంపై జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6 (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-6, 2023-24) ఆందోళనకర గణాంకాలను వెల్లడించింది. దేశవ్యాప్తంగా పురుషుల్లో మద్యపానం, పలు రాష్ట్రాల్లో మహిళల్లో పొగాకు వినియోగం పెరిగినట్లు ఈ సర్వే స్పష్టం చేసింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పురుషుల మద్యం వినియోగం పెరగడం గమనార్హం. జాతీయ స్థాయిలో 15 ఏళ్లు పైబడిన పురుషుల్లో మద్యపాన అలవాటు ఉన్నవారి సంఖ్య 18.7 శాతం నుంచి 18.9 శాతానికి స్వల్పంగా పెరిగింది.

2లో..

## రక్షణమంత్రి రాజ్‌నాథ్‌తో రేవంత్ భేటీ

- కీలక అంశాలపై చర్చ



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశమయ్యారు. దాదాపు 20 నిమిషాల పాటు తెలంగాణ ప్రాజెక్టులు, అంశాలపై చర్చలు జరిపారు. ప్రస్తుతం ఢిల్లీలో పర్యటిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి మూసీ సుందరీకరణలో భాగంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం రక్షణ శాఖ భూములను బదిలీ

2లో..

ప్రజాప్రశ్న
హైదరాబాద్ మంగళవారం 23, జూన్ 2026

# తెలంగాణ కాంగ్రెస్ ప్రక్షాళన.?

దెబ్బతీయడానికి, హైదరాబాద్ కోర్టు డాక్యుమెంట్లను నేరుగా మధ్యప్రదేశ్ బీజేపీ నేతలకు చేరవేసి కోవర్టు రాజకీయం నడిపినట్లు ఏఐసీసీ వర్గాలు గుర్తించాయి.

### రంగంలోకి హైకమాండ్ విచారణ కమిటీ.. ఒక ఫస్ట్-టైమ్ ఎమ్మెల్యేదే తప్పు!

ఈ ద్రోహంపై రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఏఐసీసీ తక్షణమే ఒక అంతర్గత విచారణ కమిటీని నియమించింది. సోషల్ మీడియా, అంతర్గత నిఘా వర్గాల నుంచి అందిన సమాచారం ప్రకారం ఈ కమిటీ ప్రాథమిక విచారణను పూర్తి చేసింది. తెలంగాణకు చెందిన ఒక కీలకమైన ఫస్ట్-టైమ్ ఎమ్మెల్యే ఈ డాక్యుమెంట్ల లీకేజీలో ప్రధాన సూత్రధారిగా ఉన్నట్లు కమిటీ నిర్ధారించినట్లు సమాచారం. పార్టీలో ఉంటూ ప్రత్యర్థి పార్టీకి సమాచారం అందించి, ఏకంగా ఏఐసీసీ ఇన్‌చార్జ్ నామినేషన్‌నే కొంపముంచిన సదరు ఎమ్మెల్యే వ్యవహారంపై హైకమాండ్ కఠిన చర్యలకు సిద్ధమవుతోంది.

### తెలంగాణ కాంగ్రెస్‌లో మార్పులు తప్పవా?

మీనాక్షి నటరాజన్ ఇష్యూలో సదరు ఫస్ట్-టైమ్ ఎమ్మెల్యేతో పాటు.. ఆయన వెనుక ఉండి నడిపించిన ఒక సీనియర్ నేతపై కూడా అధిష్ఠానం నజర్ పెట్టింది. ఈ కుట్ర వల్ల కాంగ్రెస్ ఒక విలువైన రాజ్యసభ స్థానాన్ని చేజేతులా కోల్పోవాల్సి వచ్చింది. దీనికి బాధ్యుడిగా తేలిన ఆ ఎమ్మెల్యేను పార్టీ నుండి సస్పెండ్ చేయడమా లేక షోకాజ్ నోటీసులు ఇచ్చి పక్కన పెట్టడమా అనే దానిపై కసరత్తు జరుగుతోంది. కేవలం ఆ ఒక్క ఎమ్మెల్యే మాత్రమే కాకుండా, తెలంగాణ కాంగ్రెస్ కమిటీలో విమర్శలు ఎదుర్కొంటున్న మరికొందరు నేతలను కూడా పదవుల నుండి తొలగించే అవకాశం ఉందని, త్వరలోనే తెలంగాణ కాంగ్రెస్‌లో భారీ ప్రక్షాళన ఖాయమని పొలిటికల్ సర్కిల్స్‌లో ప్రచారం సాగుతోంది.

### సమూల ప్రక్షాళనకు రాహుల్ గాంధీ నిర్ణయం.. చరమగీతం పాడాల్సిందే!

ఇలాంటి కోవర్టు, బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు శాశ్వతంగా చరమగీతం పాడాలని రాహుల్ గాంధీ గట్టిగా భావిస్తున్నారు. పార్టీ లైన్ దాటిన వారు ఎంతటి వారైనా సరే సహించేది లేదనే బలమైన సంకేతాన్ని ఇవ్వడమే రాహుల్ గాంధీ ముఖ్య ఉద్దేశం. తెలంగాణలో పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, అంతర్గత కుమ్ములాటలు జాతీయ స్థాయిలో పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయని ఆయన అసంతృప్తితో ఉన్నారు. మీనాక్షి నటరాజన్ వంటి క్లీన్ ఇమేజ్ ఉన్న నేతకు జరిగిన ఈ అన్యాయంపై కఠినంగా వ్యవహరించకపోతే క్యాడర్‌లో తప్పుడు సంకేతాలు వెళ్తాయని, అందుకే ఈసారి ప్రక్షాళన సమూలంగా, కఠినంగా ఉండబోతోందని భావిస్తున్నారు.

# అమెరికాతో ట్రేడ్ డీల్ వద్దు

ఆసక్తి చూపిస్తున్నారు. తమ ఉత్పత్తులను భారత వ్యవసాయ మార్కెట్లోకి ప్రవేశపెట్టి తద్వారా లాభాలను ఆర్జించాలని అగ్రరాజ్యం చూస్తోంది.దీనివల్ల భారత్ లో యాపిల్, ఆల్ మండ్స్, వాల్ నట్స్, ఇతర దేశీయ హార్టికల్చర్ పంటలను పండించే లక్షల మంది రైతుల జీవనోపాధి దెబ్బతింటుంది. ఇక అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశం ఇప్పటికే అక్కడి రైతులను సబ్సిడీలు అందిస్తోంది. దాంతో అక్కడి వ్యవసాయ ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు తగ్గిస్తే ఆ ప్రొడక్ట్స్ తో భారత్ లోని చిన్న, సన్నకారు రైతులు పోటీపడటం అసాధ్యం అని హిల్ స్టేట్ హార్టికల్చర్ ఫోరమ్ తన లేఖలో పేర్కొంది.ఇక హిమాచల్ ప్రదేశ్, జమ్మూకాశ్మీర్, ఉత్తరాఖండ్ తదితర కొండ ప్రాంతాల రాష్ట్రాల్లో స్థానిక వాతావరణ పరిస్థితుల కారణంగా యాపిల్, వాల్ నట్ తదితర పంటలను పండించే రైతులు ప్రత్యామ్నాయ పంటలకు మారడం చాలా అరుదు. అందువల్ల దిగుమతులు పెరిగితే వీరి జీవనోపాధి, ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై హిల్ స్టేట్ హార్టికల్చర్ ఫోరమ్ కన్వీనర్ హరీష్ చౌహాన్ మాట్లాడుతూ తమ అభ్యర్థనను ప్రధాని మోదీ స్వాగతిస్తారని రైతుల ఆవేదనను అర్థం చేసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతీసే

# ప్రయత్నాలు జరుగుతున్నాయి

రెచ్చగొట్టేలా సాగుతున్న తప్పుడు ప్రచారాలను, ఘటనలను అరికట్టేందుకు అధికారులు, ఉద్యోగులు చొరవ చూపాలన్నారు. ఇటీవల జరిగిన కొన్ని నేరాలకు మానసిక సమస్యలు, మరికొన్నింటికి గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వ్యసనం కారణమని ఆయన విశ్లేషించారు. ప్రభుత్వం పాత కేసులను సైతం పరిష్కరిస్తోందని, 2019లో జరిగిన నేరాలను ఇప్పుడు గుర్తించి నిందితులను పట్టుకుని శిక్షలు పడేలా చేస్తున్నామని తెలిపారు. తప్పు చేసిన వారు చట్టం నుంచి తప్పించుకోలేరనే వాస్తవాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు.వాహనాల నంబర్ ప్లేట్ల విషయంలో నిబంధనలను కఠినంగా అమలు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగానే నంబర్ ప్లేట్లు ఉండేలా చూడాలన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సాంకేతికత కీలకమని, ఈ నేపథ్యంలో క్వాంటం ఆర్క్, సెమీకండక్టర్ పార్క్ ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ఈ ఏడాది డిసెంబర్‌లో క్వాంటం కంప్యూటర్‌ను ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. పచ్చదనం పెంపు, పరిశుభ్రత, జల భద్రత, భూగర్భ జలాల రీఛార్జ్, నదుల పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.ప్రజా సమస్యల పరిష్కారంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. పబ్లిక్ గ్రీవెన్స్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కింద వచ్చే అర్జీలను సానుభూతితో పరిశీలించాలన్నారు. "సమస్య పరిష్కారం కోసం తమ దగ్గరకు వచ్చే పౌరులతో అధికారులు, ఉద్యోగులు మర్యాదగా ప్రవర్తించాలి. వారి స్థానంలో మనమే ఉంటే ఎలా ఆలోచిస్తామో అలా ఆలోచించి సేవలు అందించాలి. ఇది పరిపాలనపై ప్రజల్లో సానుకూల దృక్పథాన్ని పెంచుతుంది" అని ఆయన హితవు పలికారు.ఉద్యోగుల్లో సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహిస్తామని, పనితీరు ఆధారంగానే బాధ్యతలు అప్పగిస్తామని తేల్చిచెప్పారు. క్షేత్రస్థాయి పర్యటనల ద్వారానే వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం సాధ్యమవుతుందని, మంత్రులు, అధికారులు, ఉద్యోగులు దీనికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సాంకేతికత అందుబాటులోకి వచ్చాక ఫైళ్ల క్లియరెన్స్ సులభమైందని, అయితే వినూత్న ఆలోచనలు లేకపోతే వ్యవస్థలు నిస్సారంగా మారతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నేను కేసీఆర్ అంత మంచోడిని కాదు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కేసీఆర్ అనే మూడు అక్షరాలే లేకపోతే తెలంగాణ అనే రాష్ట్రమే లేదు. ప్రజల్లో విశ్వాసం నింపి, ప్రాణాలకు సైతం తెగించి, తెలంగాణ తెచ్చిన నాయకుడు కేసీఆర్'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట, పరకాల నియోజకవర్గాలలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేటీఆర్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ పార్టీని కుర్చీ మడత పెట్టి తరిమేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు.వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని కార్యకర్తలు దైర్యంగా ఉండి పార్టీని ముందుకు తీసుకెళ్లాలి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు.కాంగ్రెస్ పార్టీ పాలనలో కక్ష సాధింపు రాజకీయాలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తప్పుడు కేసులు పెట్టి బీఆర్ఎస్ కార్యకర్తలను వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలను వేధించిన వారిని వదిలిపెట్టే ప్రసక్తేలేదు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. చిట్టి నాయుడికి సినిమా చూపించే బాధ్యత నాది అని కేటీఆర్ చెప్పుకొచ్చారు. వచ్చే ఐదేళ్లు చిట్టి నాయుడు, ఆయన బృందానికి రాజకీయంగా సమాధానం చెబుతానని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ కార్యకర్తలను వేధించిన వారిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. రిటైర్ అయినా, పారిపోయినా, సప్త సముద్రాలు దాటినా తీసుకొచ్చి నిలబెడతా అని చెప్పుకొచ్చారు. కార్యకర్తల వెంటే పార్టీ ఉంటుందని భరోసా కల్పించారు. తానైతే కేసీఆర్ అంత మంచివాడిని మాత్రం కాదని కేటీఆర్ చెప్పుకొచ్చారు. మా కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్న వారిని వదిలిపెట్టం!. పక్కా.. చిట్టి నాయుడికి, ఆయన బృందానికి సినిమా చూపెట్టే బాధ్యత నాది అని కేటీఆర్ చెప్పుకొచ్చారు.

## మాజీ సిఐ నాగరాజుకి మద్దతుగా

# కృష్ణలంకలో కొవ్వొత్తులు ర్యాలీ

**విజయవాడ** కృష్ణలంక మాజీ సిఐ నాగరాజు కి మద్దతుగా కృష్ణలంకలో కొవ్వొత్తులు ర్యాలీ నిర్వహించారు. స్థానికులు మాట్లాడుతూ నాగరాజు కృష్ణలంక పిఎస్ లో చార్జి తీసుకున్నప్పటి నుండి రౌడీయిజం మీద ఉక్కు పాదం మోపారు. ముఖ్యంగా కృష్ణలంక ఏరియాలో గంజాయి బ్యాచ్ ఆగడాలను పూర్తిగా అరికట్టారని అన్నారు.ఆడపిల్లలపై ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే వాడి కి తమదైన శైలిలో ట్రీట్మెంట్ ఇచ్చి నేరలను అరికట్టారు. గత ప్రభుత్వ హయాంలో రాత్రిపూట పది తర్వాత ఆడవాళ్లు బయటికి వెళ్లాలంటేనే భయపడే వారు. ఇప్పుడు నాగరాజును ఇక్కడి నుండి తప్పిస్తే మళ్లీ వారి ఆగడాలు ఎక్కువ అవుతాయి. గతంలో రౌడీ షీటర్లను ఎన్కౌంటర్ చేసినప్పుడు దానిని సమర్థించిన పెద్దలు దీన్ని ఎందుకు తప్పుగా అర్థం చేసుకుంటున్నారని ప్రశ్నించారు.

# అశ్విని వైష్ణవ్‌తో రేవంత్, కిషన్ రెడ్డి భేటీ

అడ్డుపడుతున్నారని, తెలంగాణకు ఆయన నయాపైసా లాభం చేయడం లేదంటూ గతంలో సీఎం రేవంత్ రెడ్డి బహిరంగంగానే తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అంతే ఘాటుగా స్పందించారు. తాను తెలంగాణ ప్రాజెక్టులను ఎన్నడూ అడ్డుకోలేదని, ఒకవేళ రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమైతే కలిసివస్తే ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులను కలుద్దామంటూ రేవంత్ రెడ్డికి ఏకంగా లేఖ రాశారు. ఈ లేఖల పరంపర తర్వాత, సీఎం రేవంత్ రెడ్డి తన ఢిల్లీ పర్యటన ఖరారైన తరుణంలో కిషన్ రెడ్డిని కూడా తమతో కలిసి రావాలని అధికారికంగా కోరారు. దాంతో ఇద్దరు నేతలూ కలిసి రైల్వే మంత్రి కార్యాలయానికి వెళ్లారు.ఈ ఉన్నత స్థాయి సమావేశంలో హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 దాదాపు 70 కిలోమీటర్ల మేర ప్రతిపాదించిన శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, ఓల్డ్ సిటీ కారిడార్లు కు అవసరమైన కేంద్ర ప్రభుత్వ అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. మెట్రో ఫేజ్-1కు సంబంధించిన రుణాల రీస్ట్రక్చరింగ్, ఫేజ్-2 నిర్మాణానికి అవసరమైన భారీ నిధుల కోసం ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి తక్కువ వడ్డీకి లభించే దీర్ఘకాలిక లోన్ విషయంలో ఏర్పడిన ఇబ్బందులను తొలగించాలని కోరారు. ఐఆర్ఎఫ్‌సీ ఆర్థిక తోడ్పాటు అందిస్తే మెట్రో ప్రాజెక్ట్ భారం రాష్ట్ర బడ్జెట్‌పై పడకుండా సులువుగా ముందుకు సాగుతుంది.కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌తో జరిగిన ఈ చర్చలు అత్యంత సానుకూల వాతావరణంలో జరిగాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం అనంతరం మీడియాకు వెల్లడించారు. ఐఆర్ఎఫ్‌సీ లోన్ పై కేంద్రం సానుకూలంగా స్పందించిందని ఆయన పేర్కొన్నారు. ఈ మెట్రో ప్రాజెక్టులకు సంబంధించిన తదుపరి కీలక అడుగు నేడు పడబోతోందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో తాము ఉమ్మడిగా సమావేశం కానున్నట్లు తెలిపారు. మెట్రో ప్రాజెక్టుల భవిష్యత్తు, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నుంచి వచ్చే గ్రాంట్లపై ఆ భేటీతో పూర్తి స్థాయి క్లారిటీ వస్తుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.కారణాలు ఏవైనా కావచ్చు, రాజకీయంగా కాంగ్రెస్, బీజేపీల మధ్య ఎంతటి వైరం ఉన్నప్పటికీ తెలంగాణ హక్కులు, నిధుల సాధన కోసం ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి కలిసికట్టుగా అడుగులు వేయడం ఒక మంచి సాంప్రదాయానికి నాంది పలికింది. కేవలం ఫోటోలకు, ప్రెస్ మీట్లకు మాత్రమే ఈ ఐక్యత పరిమితం కాకూడదని కేంద్రం నుంచి నిధులు, అనుమతులు వాస్తవంగా తెలంగాణకు తెచ్చే విషయంలో కూడా ఇద్దరు నేతలు ఇదే చిత్తశుద్ధితో, పట్టుదలతో ఉండాలని తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా భాగ్యనగర టెక్కీలు, సామాన్య ప్రయాణికులు కోరుకుంటున్నారు.

# మూడు 'ఎస్' లే మా బలం

ప్రారంభించారు. "మీ తండ్రి చంద్రబాబు గారు 90వ దశకం చివర్లో కేంద్ర రాజకీయాల్లో కీలకంగా ఉన్నప్పటి నుంచి నాకు తెలుసు. అప్పట్లో మాతో చాలా చనువుగా ఉండేవారు. ఇప్పుడు మిమ్మల్ని చూస్తుంటే ఆ రోజులు గుర్తొస్తున్నాయి. మీలో మీ నాన్నగారి పోలికలు, అదే ఆకర్షణ కనిపిస్తున్నాయి. అందుకే మిమ్మల్ని ప్రజలు మరింత దగ్గరగా తెలుసుకోవాలని కోరుకుంటున్నాను" అంటూ లోకేశ్ ను సంభాషణలోకి ఆహ్వానించారు.

### మీ రాజకీయ ప్రయాణం, భవిష్యత్ ప్రణాళికలు ఏంటి?

ఆర్నబ్ అడిగిన ఈ ప్రశ్నకు లోకేశ్ బదులిస్తూ, "ఇదొక అద్భుతమైన ప్రయాణం. రాజకీయమనేది గమ్యం కాదు, ఒక నిరంతర ప్రయాణం. దేవుడి దయ, ప్రజల ఆశీస్సులు ఉంటే నాకు ఇంకా 40-50 ఏళ్ల రాజకీయ భవిష్యత్తు ఉంది. గత పదేళ్లలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశాను. విజయాలు, పరాజయాలను సమానంగా స్వీకరించాను. ప్రస్తుతం యువ నాయకులు బాధ్యతలు స్వీకరించి దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాల్సిన సమయం ఇది. నేను అదే బాటలో పయనిస్తున్నాను" అని తెలిపారు.

### ముఖ్యమంత్రి మీకు ఇచ్చిన లక్ష్యం ఏంటి?

"2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనేది మా ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన విజన్. ఆయనకు పనులు ఎప్పుడూ వేగంగా జరిగిపోవాలి. అలాంటి బాస్ ఉన్నప్పుడు ఆయన వేగాన్ని అందుకోవడం కష్టమే అయినా, ఆ ప్రయత్నంలోనే ఉన్నాను. ప్రస్తుతం ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టించేందుకు ఏర్పాటు చేసిన మంత్రుల బృందానికి నేను చైర్మన్‌గా ఉన్నాను. ఉద్యోగాల సృష్టే నా ఏకైక లక్ష్యం. ఇదే నన్ను రేయింబవళ్లు పనిచేసేలా చేస్తోంది" అని లోకేశ్ వివరించారు.

### పెట్టుబడులకు ఏపీ ఎందుకు ప్రత్యేకం?

"మేం మూడు 'ఎ'ల ఫార్ములాను నమ్ముకున్నాం. అవే వేగం, స్థిరత్వం, సేవ. మా వేగానికి నిదర్శనమే దేశ చరిత్రలోనే అతిపెద్ద ఎఫ్‌డీఐ అయిన గూగుల్ డేటా సెంటర్ కేవలం 13 నెలల్లో, ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ 17 నెలల్లో పనులు ప్రారంభించడం. స్వదేశీ ఫైటర్ జెట్ తయారీ ప్రాజెక్టు ఏఎంసీఏకు 37 రోజుల్లోనే 600 ఎకరాల భూమిని ఉచితంగా ఇచ్చాం. రెండోది స్థిరత్వం. మా నాయకుడికి అభివృద్ధిపై స్పష్టమైన ట్రాక్ రికార్డ్ ఉంది. మూడోది సేవ. వ్యాపారవేత్తలను నేను దేశ నిర్మాతలుగా చూస్తాను. వారికి సేవ చేయడం నా బాధ్యత. ఈ మూడు 'ఎ'ల వల్లే దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వస్తున్నాయి" అని లోకేశ్ అన్నారు.

### అమరావతి పురోగతి, నిధులపై స్పష్టత

ఢిల్లీలో మీకు ప్రత్యేక గుర్తింపు లభిస్తోందా, అమరావతికి కేంద్రం నుంచే నిధులు వస్తున్నాయా అన్న ప్రశ్నకు లోకేశ్ స్పందిస్తూ, "ఎక్కువ ఎంపీలు ఉండటం వల్ల మా గొంతు గట్టిగా వినిపించడానికి అవకాశం దొరికింది. కానీ, రాష్ట్రాల మధ్య పోటీతత్వం ఉంటేనే దేశం గెలుస్తుంది. మా పనితీరు వేగంగా ఉండటం వల్లే కేంద్రం నుంచి ప్రాజెక్టులు సాధించగలుగుతున్నాం. ఇక అమరావతి అనేది ఒక సెల్ఫ్-ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్. 2028 నాటికి అసెంబ్లీ, సెక్రటేరియట్ వంటి ప్రభుత్వ భవనాలను పూర్తి చేస్తామని ప్రధానికి మాట ఇచ్చాం. దాని కోసం దాదాపు 60 వేల కోట్ల రూపాయల నిధులు సమీకరించబోతున్నాం. దేశం గర్వపడేలా ప్రపంచ స్థాయి నగరాన్ని నిర్మిస్తున్నాం. అయితే రాజధాని అమరావతే అయినా, విశాఖను ఐటీ హబ్‌గా, తిరుపతి ప్రాంతాన్ని తయారీ కేంద్రంగా అభివృద్ధి చేస్తూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం" అని స్పష్టం చేశారు.

### టీడీపీలో యువ నాయకత్వంపై..

టీడీపీలో యువతకు ఇస్తున్న ప్రాధాన్యంపై అడిగిన ప్రశ్నకు, "మా పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా కొత్త తరం నాయకత్వాన్ని ప్రోత్సహిస్తున్నాం. ఈ ఎన్నికల్లో గెలిచిన మా ఎమ్మెల్యేల్లో 50 శాతం మంది, మంత్రుల్లో 17 మంది తొలిసారి గెలిచినవారే. దేశంలోనే అత్యంత పిన్న వయస్కులైన పార్లమెంటరీ బృందం మాది. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడే ఇందుకు నిదర్శనం. యువత ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తాం" అని లోకేశ్ బదులిచ్చారు.

# పురుషుల్లో మద్యపానం, మహిళల్లో ధూమపానం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, కేరళ, పంజాబ్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఈ పెరుగుదల స్పష్టంగా కనిపించింది. మద్యపాన నిషేధం అమల్లో ఉన్న బీహార్‌లో సైతం పురుషుల మద్యం వినియోగం 15.4 శాతం నుంచి 16.5 శాతానికి పెరగడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్‌లో ఈ శాతం 23.1 నుంచి 23.3కు, తెలంగాణలో 43.4 నుంచి 43.9 శాతానికి చేరింది.దేశవ్యాప్తంగా మహిళల్లో మద్యపానం అలవాటు 1.3 శాతం నుంచి 1.1 శాతానికి తగ్గింది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో (0.5 నుంచి 0.6 శాతం), తెలంగాణలో (6.7 నుంచి 7.1 శాతం) మహిళా మద్యపాన ప్రియుల సంఖ్య పెరిగింది. గుజరాత్‌లో మహిళలు, పురుషుల్లో మద్యం సేవించే వారి సగటు 5.8 శాతం నుంచి 5.2 శాతానికి తగ్గింది. మరోవైపు, దేశవ్యాప్తంగా మహిళల్లో పొగాకు వినియోగం 8.9 శాతం నుంచి 8.4 శాతానికి స్వల్పంగా తగ్గింది. అయినప్పటికీ తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా 13 రాష్ట్రాల్లో మహిళలు పొగాకును ఎక్కువగా వినియోగిస్తున్నట్లు నివేదిక తేలింది. పురుషుల్లో పొగాకు వినియోగం 38 శాతం నుంచి 36.3 శాతానికి తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యత తక్కువగా ఉండటం, ఆరోగ్య సంరక్షణ సేవలు అందుబాటులో లేకపోవడం వంటి కారణాల వల్ల పొగాకు, మద్యం వాడకం ఎక్కువగా ఉన్నట్లు నివేదిక విశ్లేషించింది.ఈ గణాంకాలపై ఐసీఎంఆర్-ఎన్ఐసీపీఆర్ డైరెక్టర్ డాక్టర్ షాలిని సింగ్ స్పందించారు. "జాతీయ సగటులు సంతృప్తికరంగా ఉన్నట్లు అనిపించినా, పలు రాష్ట్రాల్లో సమస్య తీవ్రంగా ఉంది. అందువల్ల ప్రతి రాష్ట్రం, జిల్లాకు ప్రత్యేకమైన కార్యాచరణ అవసరం" అని ఆమె అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా గర్భిణుల్లో పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో కౌన్సెలింగ్ సేవలను విస్తృతం చేయాలని ఆమె సూచించారు. క్యాన్సర్, గుండె జబ్బుల వంటి అసంక్రమిత వ్యాధులు పెరగడానికి ఈ వ్యసనాలే ప్రధాన కారణమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ఊపిరి ఉన్నంతవరకు భాజపాలోనే: రామక్రిష్ణ

**సికింద్రాబాద్..** పార్టీ నుండి బహిష్కరించిన అంశం క్రమశిక్షణ కమిటీ పరిధిలో ఉందని త్వరలోనే నిజానిజాలు బయటకు వస్తాయని కంటోన్మెంట్ భాజపా బహిష్కృత నేత రామకృష్ణ అన్నారు. కంటోన్మెంట్ ప్రాంత అభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తూ అభివృద్ధికి సహకరించడం లేదని కంటోన్మెంట్ టి పి టి బకాయిల విషయంలో హైకోర్టును ఆశ్రయించినట్లు మాజీ కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ స్పష్టం చేశారు. కంటోన్మెంట్ బోర్డు కు రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన టిపిటి బకాయిల చెల్లింపులపై గతంలోనే హైకోర్టును ఆశ్రయించగా ఇటీవల హైకోర్టు తెలంగాణ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కి ఫార్మ్ వన్ జారీ చేసినట్లు ఆయన వెల్లడించారు. 2023లో నామినేటెడ్ సభ్యుడిగా ఉన్న సమయంలోనే హైకోర్టును ఆశ్రయించగా అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం నుండి 80 కోట్ల రూపాయల బకాయిలను రాబట్టి కంటోన్మెంట్ అభివృద్ధికి వెచ్చించినట్లు పేర్కొన్నారు.

# రక్షణమంత్రి రాజ్‌నాథ్‌తో రేవంత్ భేటీ

చేసినందుకు కృతజ్ఞతలు చెప్పారు. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశం కావడం వల్ల ఆదిలాబాద్‌లో ఎయిర్‌ఫోర్స్ ఎయిర్‌పోర్టుకు సహకరిస్తామని కేంద్రమంత్రికి సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.ఢిల్లీలోని రక్షణ శాఖ కార్యాలయం కర్తవ్య భవన్‌లో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఇక ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ టెర్మినల్‌తోపాటు కార్గో, ఎమ్ఆర్‌వో, హ్యాంగర్ సౌకర్యాలు కూడా ఆదిలాబాద్‌లో కల్పించాలని తేల్చి చెప్పారు. హ్యాంగర్స్ ఏర్పాటుకు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు అనుకూలంగా ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లాలోని దేవరకద్ర సమీపంలో డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) ప్రాజెక్ట్ తొందరగా మంజూరు చేయాలని కోరారు.భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యం కోసం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటు కార్గో, ఎంఆర్‌వో, హ్యాంగర్ వంటి సౌకర్యాలను కూడా పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కేంద్రమంత్రిని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఇటీవలి కాలంలో మధ్య ఆసియాలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకునేందుకు సరైన ప్రాంతాల కోసం అన్వేషిస్తున్నాయని తెలిపారు.హ్యాంగర్ ఏర్పాటుకు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అత్యంత అనుకూలమైన ప్రాంతమని వివరించారు. ఈ క్రమంలోనే ఆ దిశగా అభివృద్ధి చేయాలని రాజ్‌నాథ్ సింగ్‌కు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్అండ్‌బీ ప్రత్యేక సెక్రటరీ వికాస్‌రాజ్ సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ కేఎస్ శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ ఉన్నారు.

# పల్లె వీక్షణంలో పాల్గొన్న కలెక్టర్

**నెల్లూరు** నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం పిడతాపోలూరులో నిర్వహించిన పల్లెవీక్షణం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పాల్గొన్నారు. గ్రామాల్లో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వడ్డిపాలెంలో ఉపాధి హామీ పనులు, జల్‌జీవన్ మిషన్ తాగునీటి ట్యాంకులను తనిఖీ చేశారు. పిడతాపోలూరులో అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య కేంద్రం, రైతు సేవా కేంద్రాలను సందర్శించారు. గ్రామంలో పరిశుభ్రత, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణపై స్థానిక అధికారులతో సమీక్షించారు. ప్రజలతో నేరుగా మాట్లాడిన ఆయన.. పలువురి సమస్యలు తెలుసుకొని వినతులు స్వీకరించారు. తక్షణ పరిష్కారానికి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.

# జీజీహెచ్ కి ఐఓఎల్ సీఎస్ ఆర్ నిధులు

### - హజరయిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం జిల్లాలోనే ఉత్తమ సేవలు అందించే ఆసుపత్రిగా జి.జి.హెచ్ శ్రీకాకుళం ను తీర్చిదిద్దుతామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు.బలగలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అక్షర సమావేశ మందిరంలో ఇండియన్ ఆయిల్ కార్పరేషన్ లిమిటెడ్ నుండి 4 కోట్ల ముప్పై లక్షల సి.ఎస్.ఆర్ నిధులతో ఏర్పాటు చేయనున్న వైద్య పరికరాలకు సంబంధించి మెమొరాండం ఆఫ్ అగ్రిమెంట్ ను జి.జి.హెచ్ అధికారులతో కలసి మార్చుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామ్మోహన్ నాయుడు ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో మాట్లాడారు. 700 కి పైగా ఇన్ పేషంట్.. 1500కి పైగా అవుట్ పేషంట్ సామర్థ్యంతో నిత్యం రోగులకు సేవలు అందిస్తున్న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వైద్య బృందానికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి తోనే జిల్లా అభివృద్ధి ముడిపడి ఉందని తాను విశ్వసిస్తానని.. సరైన వైద్య పరికరాలు లేకుండా సరైన వైద్యం వీలు కాదని రామ్మోహన్ నాయుడు అన్నారు. గత ఏడాది ఇదే సమయంలో జీజీహెచ్ రివ్యూ సమావేశంలో ఆసుపత్రికి ఏవేవి పరికరాలు అవసరమో.. ఇక్కడి వైద్య బృందాన్ని అడిగి నివేదిక సిద్ధం చేసుకున్నట్టు తెలిపారు. అనంతరం అనేక కార్పోరేట్ కంపెనీలకు సంప్రదించి వారి సి.ఎస్.ఆర్ నిధులు ఇక్కడ వెచ్చించేలా తనవంతు కృషి చేశానని రామ్మోహన్ నాయుడు అన్నారు.

# పవన్‌కు కులం ఆపాదించడం సరి కాదు

### - జనసేన నేత బాలినేని శ్రీనివాస్ రెడ్డి

**హైదరాబాద్** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు కులాన్ని ఆపాదించటం సరైంది కాదని మాజీ మంత్రి, జనసేన నేత బాలినేని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ లో అయన మీడియాతో మాట్లాడారు. బాలినేని మాట్లాడుతూ కాపులను డివైడ్ చేయాలని వైసిపీ ప్రయత్నిస్తుంది. 100శాతం కాపులు పవన్ కళ్యాణ్ తో ఉన్నారు. ఎలాగైనా కూటమి నుంచి పవన్ బయటకు తీసుకురావాలని వైసీపీ కుట్ర చేస్తుంది పవన్ కల్యాణ్ ను కాపుల నుంచి దూరం? చేయటం ఎవరి తరం కాదని అన్నారు.

సాయికృష్ణ ఎపిసోడ్ పై.. సిట్ నిజ నిజాలు తేల్చుతుంది. సీఐ నాగరాజును కాపాడాల్సిన పని కూటమి ప్రభుత్వానికి లేదు. లాకప్ డెత్ కు ఎవరూ అంగీకరించరు. రాష్ట్రంలో ఏది జరిగినా పవన్ కళ్యాణ్ కు ఆపాదించటం సరైంది కాదు. వైసీపీ నేతలు.. నవీన్ రెడ్డి అనే వ్యక్తి ఫోటో చూపించి సాయి కృష్ణగా చెప్తున్నారు. రెడ్డి అయిన నవీన్ రెడ్డి కుటుంబాన్ని ఎందుకు జగన్ రెడ్డి ఎందుకు పరామర్శించలేదు సాయికృష్ణ చనిపోయాడో లేదో కూడా నిర్ధారణ లేదు. వైసీపీ కాపు నేతలను కాపులు నమ్మే పరిస్థితి లేదు. ఎమ్మెల్యేలుగా గెలిపించింది ఇంట్లో కూర్చోవడానికి కాదని వైసీపీ గుర్తుంచుకోవాలి. అసెంబ్లీలో సైతం కుటుంబ సభ్యుల గురించి మాట్లాడే సంస్కృత వైసీపీనే ప్రారంభించింది, చంద్రబాబు సతీమణి గురించి అసెంబ్లీలో మాట్లాడటం చాలా తప్పు. సీఎం హోదాలో జగన్ ఆనాడే ఖండించి ఉంటే జగన్ పరిస్థితి మరోలా ఉండేది. ఇలాంటి రాజకీయాల్లో ఎందుకున్నామా అని అనిపిస్తుందని వ్యాఖ్యానించారు.

# చక్రాయపేట అక్రమ ఇసుక క్వారీ వద్దకు వైసీపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

**కడప** కడప జిల్లా చక్రాయపేట అక్రమ క్వారీ కుంటలో పడి జయంత్ రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి మృతి చెందిన ఘటనపై ఎంపి అవినాష్ రెడ్డి స్పందించారు.

సోమవారం ఉదయం క్వారీ వద్దకు వెళ్లారు. చిన్నారుల మృతదేహాలకు నివాళులు అర్పించి తల్లిదండ్రులను ఓదార్చారు. రాత్రి నుండి ఘటనాస్థలిలోనే చిన్నారుల మృతదేహాలతో తల్లిదండ్రులు, గ్రామస్థులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారుల మృతదేహాలను చూడడానికి చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రజలు తరలివచ్చారు.

# డీటీవోను ఢీకొన్న టిప్పర్.. అక్కడికక్కడే మృతి

**భూపాలపల్లి** వాహనాలు తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారిని బొగ్గు టిప్పర్ లారీ ఢీకొట్టింది. దాంతో జిల్లా రవాణ శాఖాధికారి వెంకన్న అక్కడికక్కడే మృతిచెందారు. ఘటనలో మృతదేహం నుజ్జు నుజ్జైయింది. భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్ శివారులోని ఆర్టీవో కార్యాలయం ఎదుట పరకాల ? భూపాలపల్లి హైవేపై ఘటన జరిగింది. మృతుడు వెంక్న 15 రోజుల క్రితమే భూపాలపల్లికి బదిలీ మీద వచ్చారు. పోలీసులు టిప్పర్ డ్రైవర్ను అదుపులోకి తీసుకున్నారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ

# జూన్ 25 నుంచి ప్రారంభం

### - జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభం కానుందని మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ (ఐఏఎస్) మీడియాకు తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఎన్యూమరేటర్లు, బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.ప్రజలు అందించే ఎన్యూమరేషన్ పత్రాలను పూర్తిగా నింపి ఒక ప్రతిని బీఎల్‌ఓలకు తిరిగి అందజేయాలని, మరో ప్రతిని తమ వద్ద భద్రపరుచుకోవాలని సూచించారు.

ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా ప్రతి ఓటరు ఈ ప్రక్రియలో సహకరించాలని కోరారు.అలాగే, జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరిస్తామని సంచిత్ గంగ్వార్ (ఐఏఎస్) తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# గోషామహల్‌లో అక్రమ నిర్మాణాలదే రాజ్యం

## చట్టాలు కాగితాలకే పరిమితమా.?

## అధికారుల మౌనం వెనుక మర్మమేంటి.?









హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గోషామహల్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు రోజురోజుకూ పెరుగుతున్నా, వాటిని అరికట్టాల్సిన అధికారులు మాత్రం చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా మహారాజ్‌గంజ్, గౌలిగూడ, ఇస్మాయాబజార్ ప్రాంతాల్లో మున్సిపల్ చట్టాలను బేఖాతరు చేస్తూ భారీ భవనాలు నిర్మితమవుతున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గోషామహల్ సర్కిల్ పరిధిలో 100 గజాల లోపు స్థలాల్లోనే ఏడు, ఎనిమిది అంతస్తుల భవనాలు వెలుస్తుండటం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సాధారణంగా ఇలాంటి నిర్మాణాలకు కఠిన నిబంధనలు, పార్కింగ్ సదుపాయాలు, ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు తప్పనిసరి. కానీ ఇక్కడ మాత్రం సెల్లార్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తూ, సెట్‌బ్యాక్‌లు లేకుండా, రహదారులపైకి నిర్మాణాలు విస్తరిస్తున్నా ఎలాంటి అడ్డుకట్ట కనిపించడం లేదు. ఇలాంటి పరిస్థితులకు కారణం అధికారుల నిర్లక్ష్యమా.? లేక అక్రమ నిర్మాణదారులతో కుమ్మక్కయ్యారా.? అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా సెక్షన్ ఆఫీసర్ మహేందర్‌పై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. లక్షల రూపాయల లంచాలు తీసుకొని అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారనే విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నప్పటికీ, ఉన్నతాధికారులు విచారణ చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మహారాజ్‌గంజ్, గౌలిగూడ ప్రాంతాల్లో పక్కింటి నంబర్ 15-2-589 వద్ద జరుగుతున్న నిర్మాణాలపై స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందన లేదని చెబుతున్నారు. అలాగే ఇస్మాయాబజార్‌లో 4-7-1060 ఇంటి సమీపంలో జరుగుతున్న భారీ నిర్మాణంపై కూడా ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. నోటీసులు జారీ చేయకుండా, కూల్చివేతలు చేపట్టకుండా అధికారులు మౌనం పాటించడం వెనుక భారీ లావాదేవీలు జరిగాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జీహెచ్‌ఎంసీ చట్టాలు సామాన్య ప్రజలకు మాత్రమేనా.? అక్రమ నిర్మాణదారులకు వర్తించవా.? అనే ప్రశ్నలు ఇప్పుడు గోషామహల్ వాసులను వేధిస్తున్నాయి. చిన్నపాటి నిర్మాణం చేసినా సామాన్యులపై చర్యలు తీసుకునే అధికారులు, బహుళ అంతస్తుల అక్రమ భవనాల విషయంలో ఎందుకు మౌనంగా ఉంటున్నారో అర్థం కావడం లేదని లంచాలు తీసుకున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గోషామహల్ సర్కిల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సెక్షన్ ఆఫీసర్ మహేందర్‌పై వస్తున్న అనేక అవినీతి ఆరోపణలపై కూడా ఏసీబీ, స్టేట్ విజిలెన్స్ విచారణ జరిపి నిజానిజాలు వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు. లేదంటే గోషామహల్‌లో అక్రమ నిర్మాణాల రాజ్యం మరింత విస్తరించి, మున్సిపల్ చట్టాల ఉనికే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# చెత్తను వేర్వేరుగా వర్గీకరించి గ్రామపంచాయతీ ట్రాక్టర్‌కు అందించాలి

**- గోపాల్ నగర్‌లో స్వచ్ఛ తెలంగాణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం**

**తాండూర్** ప్రతి ఇంటిలో ఉత్పత్తి అయ్యే తడి చెత్త, పొడి చెత్త, సానిటరీ చెత్తతో పాటు ప్రత్యేక హానికరమైన వ్యర్థాలను వేర్వేరుగా వర్గీకరించి గ్రామపంచాయతీ ట్రాక్టర్‌కు అందించాలని గోపాల్ నగర్ సర్పంచ్ గాట్ల నర్సయ్య గ్రామ ప్రజలకు సూచించారు. తాండూర్ మండలంలోని గోపాల్ నగర్ గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ గాట్ల నర్సయ్య ఆధ్వర్యంలో గ్రామస్థులకు ఘనంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణపై ప్రజలకు వివరించి, చెత్తను సరైన విధంగా వర్గీకరించాల్సిన అవసరాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గాట్ల నర్సయ్య మాట్లాడుతూ, తడి చెత్త, పొడి చెత్త, సానిటరీ వ్యర్థాలు, హానికరమైన వ్యర్థాలను వేర్వేరుగా సేకరించడం వల్ల వ్యర్థాల నిర్వహణ సులభతరం కావడంతో పాటు గ్రామ పరిశుభ్రత మెరుగుపడుతుందని తెలిపారు. ప్రతి ఇంటి వద్ద నుంచే చెత్తను వర్గీకరించే అలవాటు పెంపొందించుకోవాలని, దీంతో పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కూడా పరిరక్షించవచ్చని అన్నారు. అలాగే ఏ రకమైన చెత్తను ఏయే కంపోస్ట్ పిట్స్‌లో వేయాలో గ్రామస్థులకు ప్రాక్టికల్‌గా వివరించి అవగాహన కల్పించారు. గ్రామపంచాయతీ ట్రాక్టర్ వచ్చినప్పుడు సిబ్బందికి సహకరిస్తూ, ముందుగానే వేరు చేసిన చెత్తను మాత్రమే అందించాలని కోరారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలందరూ గ్రామపంచాయతీ చేపడుతున్న పరిశుభ్రత కార్యక్రమాలకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సౌందర్య, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయంలో గుప్తనిధుల తవ్వకాల కలకలం



**రాయదుర్గం** మండలం చదం గొల్లలదొడ్డి సమీపంలోని లింగాలబండపై గల పురాతన చతుర్ముఖ పశుపతినాథ్ ఆలయంలో గుప్తనిధుల వేట కలకలం రేపింది. దుండగులు గతంలో నందివిగ్రహం, మూలవిరాట్ ధ్వంసం చేయగా, తాజాగా క్షుద్రపూజలు చేసి ధ్వజస్తంభం రాళ్లు పెకలించారు. సోమవారం పూజకు వెళ్లిన భక్తులు ఆలయంలో తవ్వకాలు చూసి ఆందోళన చెందారు. గుప్తనిధుల కోసమే ఆలయ ధ్వంసం జరుగుతోందని, పోలీసులు చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేశారు.

# జిల్లా అధికార యంత్రాంగాన్ని ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రగతి

**- జిల్లా ప్రత్యేక అధికారి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అహ్మద్ నదీమ్ అభినందించారు**



**సిద్దిపేట** సిద్దిపేట ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, కమిషనర్ ఆఫ్ పోలీస్ రష్మీ పెరుమాళ్ తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కింద మార్చి 16 నుంచి జూన్ 12 వరకు జిల్లాలో వివిధ శాఖలు అమలు చేసిన కార్యక్రమాలకు సంబంధించిన ఫోటో ప్రదర్శనను ఆయన పరిశీలించి, సంబంధిత శాఖల నివేదికలను పరిశీలించి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్న జిల్లా కలెక్టర్ కె. హైమావతిని ప్రత్యేకంగా అభినందించారు. సమీక్షా సమావేశంలో వైద్య, వ్యవసాయ, విద్య, గ్రామీణ అభివృద్ధి పోలీస్, ఐసిడిఎస్, ఫుడ్ సేఫ్టీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు, పంచాయతీ మరియు మున్సిపల్ అధికారులు తమ శాఖల ద్వారా చేపట్టిన కార్యక్రమాల లక్ష్యాల ప్రగతిపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు సమర్పించారు. కార్యక్రమం అమలులో ఎదురైన ఫిర్యాదులు, వాటి పరిష్కారానికి చేపట్టిన చర్యలు, జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక అధికారి వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రత్యేక అధికారి మాట్లాడుతూ. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అమలుపై ముఖ్యమంత్రి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. కార్యక్రమం అమలును పర్యవేక్షించేందుకు ప్రతి జిల్లాకు ఒక రాష్ట్ర స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించి, జిల్లాల వారీగా పురోగతిని సమీక్షించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జిల్లాలో వార్డు, గ్రామ, మండల సభల ద్వారా దాదాపు 19 వేల ఫిర్యాదులను స్వీకరించడం జరిగిందనీ ప్రత్యేక టైం బాండ్ తో ప్రణాళిక బద్ధంగా వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయడం మూలంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం జరిగిందనీ, ప్రత్యేక అధికారి సూచనల మేరకు టైం బాండుతో శాపలవారీగా సమస్యల పరిష్కారానికి ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తామని తెలిపారు. పింఛన్ల దరఖాస్తు వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తామని, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు మంత్రిగారి ఆదేశాల మేరకు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమం ముగింపులో ప్రత్యేక అధికారి నషా ముక్త్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

# వెంకన్న కుటుంబానికి

## ఉద్యోగంతోపాటు ఎక్స్ గ్రేషియా

**- మంత్రి పొన్నం**

**హైదరాబాద్** భూపాలపల్లి లో మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ వెంకన్న మృతి బాధాకరమని మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఘటనపై అయన మీడియాతో మాట్లాడారు. మంత్రి మాట్లాడుతూ వెంకన్న ఇటీవల జగిత్యాల నుండి భూపాలపల్లికి బదిలీ అయి వచ్చారు. యన స్వగ్రామం మహబూబ బాద్ దగ్గర మరిపెడ బంగ్లా. నిబంధనలు ఉల్లంఘించిన హార్వెస్టర్ రవాణా శాఖ కార్యాలయానికి తీసుకొస్తున్న సమయంలో అటు నుండి వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది వెంకన్న మృతి చెందారు. రవాణా శాఖ లో ఎన్ఫోర్స్మెంట్ పెంచాం నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించామని అన్నారు. వెంకన్న మృతిపై నేను జిల్లా కలెక్టర్, ఎస్పీ తో మాట్లాడ..ప్రిన్సిపాల్ సెక్రటరీ తో విచారణకు ఆదేశించాం. ఎం రు ఢిల్లీలో ఉన్నారు ఘటన పై మాట్లాడారు విచారణకు ఆదేశించారూ. వెంకన్న ఆ కుటుంబాన్ని ఆదుకుంటాం.. ఈ సమయంలో శవ రాజకీయాలు వద్దు. మైనింగ్ ,గ్రానైట్ , ఫ్లై యాష్ వాహనాలు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించాం. వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది..కుటుంబానికి ఉద్యోగం తో పాటు ఎక్స్ గ్రేషియా ఇస్తాం. రోడ్ సేఫ్టీ పై మేము రోడ్డు భద్రత మాసోత్సవాలు చేసి అవగాహన కల్పిస్తున్నాం. రవాణా శాఖ లో అనేక సంస్కరణలు చేస్తున్నాం.. రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి అనేక చర్యలు తీసుకుంటున్నాం లైసెన్స్ రావడానికి ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ చేస్తాం.. ఎవరైనా డ్రైవింగ్ స్కిల్స్ ఉంటేనే వారికి లైసెన్స్ వస్తుంది. వాహనాల వేగం పెరిగింది.. వాహనాల సంఖ్య పెరిగింది.. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. మా సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే మా ద్రుష్టి కి తీసుకురండి. వెంకన్న మృతిపై ప్రాథమిక విచారణ జరుగుతుంది .. యాక్సిడెంటల్ ఘటన ఇందులో ఎవరి ప్రమేయం లేదు. ప్రాణాల మీదకు వచ్చేంత ఎన్ఫోర్స్మెంట్ చేయడం లేదని అన్నారు.

# జియో మైసూర్ సంస్థ యందు ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ సిరి



**తుగ్గలి:** తుగ్గలి మండల పరిధిలోని పగిడిరాయి గ్రామ సమీపంలో గల జియో మైసూర్ సంస్థ యందు సీఎం పర్యటనలో భాగంగా ఏర్పాట్లను కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి సోమవారం రోజున పరిశీలించారు. ఈ సందర్భంగా ఈనెల 24న సీఎం పర్యటనలో భాగంగా బహిరంగ సభ ఏర్పాట్లను, వాహనాల రాకపోక ఏర్పాటులను, వాహనాల పార్కింగ్, హెలిప్యాడ్, నీటి వసతి, భద్రత తదితర వంటి మౌలిక సదుపాయాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలను తెలియజేశారు. సీఎం పర్యటనలో ఎటువంటి భద్రత లోపాలు లేకుండా పటిష్టమైన బందోబస్తు మరియు సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ఆమె అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ ఓబులేషు, తహసిల్దార్ రవి, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్యం,సామర్థ్యం మెరుగుపడతాయి

# రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా



**గోదావరిఖని:** రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహించబడింది. డీజీపీ ఆదేశాల మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బందికి కమిషనరేట్ స్థాయి మూడవ పోలీస్ డ్యూటీ మీట్?2026 కార్యక్రమాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లకు చెందిన అధికారులు, సిబ్బందికి కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ ట్రాకింగ్, పేలుడు పదార్థాల గుర్తింపు, యాంటీ-సబోటేజ్ తనిఖీలు, కంప్యూటర్ అవగాహన, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని, అనంతరం జాతీయ స్థాయిలో నిర్వహించే పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొనే అవకాశమూ ఉంటుందని తెలిపారు. శాస్త్రీయ దర్యాప్తు, వేలిముద్రల విశ్లేషణకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి, కేసుల దర్యాప్తులో మెళకువలను నేర్చుకోవడానికి, పోలీసు నైపుణ్యాలను ప్రదర్శించడానికి, సంక్లిష్టమైన కేసుల పరిష్కారానికి అవసరమైన ఆలోచనలను పరస్పరం పంచుకోవడానికి, వృత్తిపరమైన పనితీరు, సామర్థ్యాలను మెరుగుపరచుకోవడానికి పోలీస్ డ్యూటీ మీట్ ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి జోన్, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో జరిగే పోలీస్ డ్యూటీ మీట్‌లలో పాల్గొనే అవకాశం లభిస్తుందని, వివిధ ప్రాంతాల పోలీసు అధికారుల మధ్య పరస్పర సహకారం, ప్రోత్సాహం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొనే వారందరూ తమ అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించాలని, ఇక్కడ ఎంపికై కాళేశ్వరం జోన్ తరఫున, రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించి రామగుండం కమిషనరేట్‌కు, కాళేశ్వరం జోన్‌కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేందర్, ఏఓ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, సీఐలు, ఎస్‌ఐలు మరియు సిబ్బంది పాల్గొన్నారు

# డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**- గుండాల ఎస్సై ఎం. శోభన బాబు.**

**గుండాల** మండలంలోని వెల్మజల గ్రామంలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుండాల సబ్ ఇన్స్పెక్టర్ ఎం. శోభన బాబు ముఖ్యంగా పాల్గొని విద్యార్థులు, యువత మరియు గ్రామ ప్రజలకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎస్సై శోభన బాబు మాట్లాడుతూ, మత్తు పదార్థాల బారిన పడిన వ్యక్తుల జీవితాలు చిన్నాభిన్నం అవుతాయని అన్నారు. ముఖ్యంగా యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, చెడు అలవాట్లకు బానిసైతే భవిష్యత్తు నాశనం అవుతుందని హెచ్చరించారు. డ్రగ్స్ వల్ల ఆరోగ్యం, కుటుంబం, సమాజం తీవ్రంగా నష్టపోతాయని పేర్కొన్నారు. డ్రగ్స్ వద్దు ? స్పోర్ట్స్ ముద్దు" అనే నినాదంతో యువతను క్రీడల వైపు మళ్లించాలని ఆయన సూచించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిస్తే మంచి భవిష్యత్తు సాధించవచ్చని చెప్పారు. యువత తమ లక్ష్యాలను సాధించాలంటే క్రమశిక్షణతో కూడిన జీవనం గడపాలని, మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు.

# యువత జాతీయ, అంతర్జాతీయ ప్రతిభ కనబరిచేలా క్రీడాకారులను తీర్చిదిద్దాలి



**గోదావరిఖని** తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాయిఉ) వైస్ చైర్‌పర్సన్ ఉ మేనేజింగ్ డైరెక్టర్, యువజన సేవల కమిషనర్, అకోయిజం సోనీ బాలా దేవి, ఈరోజు సింగరేణి ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె క్రీడాకారులు, క్రీడా శిక్షకులు మరియు క్రీడా శాఖ అధికారులతో సమావేశమై గ్రామాలు, పట్టణాలు మరియు సింగరేణి బొగ్గు గని ప్రాంతాల్లో క్రీడలను మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలపై యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు అన్ని వర్గాలు సమిష్టిగా కృషి చేయాలని ఆమె సూచించారు. అనంతరం రామగుండంలోని సింగరేణి అతిథి గృహం ప్రాంగణాన్ని సందర్శించిన శ్రీమతి సోనీ బాలా దేవి పారిజాత మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు తన మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా సింగరేణి అటవీ విభాగం చేపడుతున్న హరితహారం, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-1 ఏరియా జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ (అటవీ) భానోత్ కర్ణ, సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థకు చెందిన డిప్యూటీ డైరెక్టర్లు, అదనపు డైరెక్టర్లు, క్రీడా శాఖ అధికారులు, సిబ్బంది మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. క్రీడల అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని, యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సోనీ బాలా దేవి తెలిపారు .

# బాధితులకు భరోసా

## - ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్

**ములుగులో జిల్లా స్థాయి కన్వర్జెన్స్ సమావేశం**

**సత్వర న్యాయమే లక్ష్యం: అన్ని శాఖల సమన్వయానికి ఎస్పీ పిలుపు**

**పోక్సో కేసుల్లో శిక్షలు ఖాయం చేస్తోన్న భరోసా సెంటర్**

**మహిళా చిన్నారుల రక్షణకు ప్రాధాన్యం: ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్**

**వైద్యం నుంచి పునరావాసం వరకు: బాధితులకు అండగా నిలుస్తున్న భరోసా**



ములుగు జిల్లా (ప్రశ్న న్యూస్) మహిళలు, చిన్నారుల రక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ బాధితులకు సత్వర న్యాయం, పునరావాసం కల్పించడమే లక్ష్యంగా ములుగు జిల్లా పోలీస్ శాఖ చర్యలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ఐపీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఎస్పీ కార్యాలయంలో జిల్లా స్థాయి కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ లైంగిక వేధింపులు, పోక్సో చట్టం, గృహహింస కేసుల్లో బాధితులైన వారికి వైద్యం, కౌన్సెలింగ్, న్యాయ సహాయం, పరిహారం, ఆశ్రయం, పునరావాస సేవలు సకాలంలో అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. బాధితులకు ఆలస్యం లేకుండా న్యాయం జరిగేలా చూడటమే "భరోసా" కేంద్రం ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని భరోసా సెంటర్ ద్వారా ఈ ఏడాది ఇప్పటివరకు బాధితులకు విస్తృత సేవలు అందించినట్లు ఎస్పీ వివరించారు. కౌన్సెలింగ్, వైద్య సహకారం, న్యాయ సహాయం అందించడంతో పాటు పరిహార ప్రతిపాదనలు సిద్ధం చేయడం, అవసరమైన వారికి ఆశ్రయం, విద్యా సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. అంతేకాకుండా నేరాల నివారణపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు. ముఖ్యంగా పలు పోక్సో కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా చేయడంలో భరోసా సెంటర్ కీలక పాత్ర పోషించిందని ఎస్పీ ప్రశంసించారు. బాధితులకు తక్షణ న్యాయం, భద్రత కల్పించడంతో పాటు గౌరవప్రదమైన పునరావాసం అందించేందుకు ములుగు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కన్వర్జెన్స్ సమావేశంలో ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ భట్, ఐపీఎస్, డీఎస్పీ కిషోర్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారిణి ప్రేమలత, ఎస్ఐ రాజ్యలక్ష్మి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, దర్యాప్తు అధికారులు, భరోసా సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

# నమ్మితే నట్టేట ముంచాడు.?

**పెరుమండ్ల రాజుపై పలువురి ఆరోపణలు**

**పెయింటింగ్ కాంట్రాక్టు చేస్తానని అడ్వాన్స్ వసూల్**

**నమ్మబలికి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసి జంప్**

**చింతలగూడ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు**

**బాధితుల న్యాయం చేయాలని కోరుతున్న**



సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ సీతాఫల్మండి ప్రాంతంలో పెయింటింగ్ పనులు చేపడతానని చెప్పి పలువురు ఇంటి యజమానుల వద్ద నుంచి భారీ మొత్తంలో అడ్వాన్సులు తీసుకున్న వ్యక్తిపై బాధితులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. బాధితుల కథనం ప్రకారం, పెరుమండ్ల రాజు అనే వ్యక్తి పెయింటింగ్ కాంట్రాక్టర్‌గా పరిచయం చేసుకుని వివిధ భవనాలు, బిల్డర్ లతో పెయింటింగ్ పనులు చేపడతానని నమ్మబలికాడు. పనులు ప్రారంభిస్తానని చెప్పి ముందస్తుగా పెద్ద మొత్తంలో నగదు తీసుకున్న అనంతరం, కొంతకాలం తర్వాత పనులను నిలిపివేసి అందుబాటులో లేకుండా పోయాడని బాధితులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ ఆయన స్పందించడం లేదని, ఫోన్లు కూడా లిఫ్ట్ చేయడం లేదని వారు వాపోతున్నారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదైనట్లు బాధితులు చెబుతున్నారు. అయినప్పటికీ తమకు న్యాయం జరగలేదని, తమ కష్టార్జిత ధనం తిరిగి పొందేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనల నేపథ్యంలో ప్రజలు ఏదైనా కాంట్రాక్ట్ పనులు అప్పగించే ముందు సంబంధిత వ్యక్తుల గత చరిత్ర, విశ్వసనీయత, ఒప్పంద పత్రాలు, చెల్లింపుల వివరాలను పూర్తిగా పరిశీలించాలని బాధితులు సూచిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపి బాధితులకు న్యాయం చేయాలని స్థానికులు మరియు బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.

# సంవత్సరం గడిచినా

# కొత్త సీసీ రోడ్డుకు మరమ్మతులు లేవు

**మిషన్ భగీరథ శాఖ నిర్లక్ష్యమే కారణం**

**- బొగ్గుల చందు, మాజీ కౌన్సిలర్**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ మున్సిపల్ పరిధిలోని 1వ వార్డులో లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన కొత్త సీసీ రోడ్డును మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతుల పేరుతో తవ్వి, సంవత్సరం గడిచినా పునరుద్ధరించకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని బి ఆర్ ఎస్ మాజీ కౌన్సిలర్ బొగ్గుల చందు విమర్శించారు. ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డును పైప్‌లైన్ లీకేజీల కారణంగా తవ్విన అనంతరం, మరమ్మతులు చేయకుండా అలాగే వదిలేయడంతో రోడ్డు మధ్యలో గుంతలు, మట్టి కుప్పలు పేరుకుపోయాయని ఆయన తెలిపారు. దీంతో వాహనదారులు, స్థానిక ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేపదే పైప్‌లైన్ లీకేజీలు ఏర్పడటానికి నాసిరకం పైపులే




కారణమని ఆరోపించిన చందు, తాత్కాలిక మరమ్మతులతో సమస్యను కొనసాగించకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్డు క్రింద ఉన్న పాత పైప్‌లైన్‌కు బదులుగా రోడ్డు పక్కన కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేసి సమస్యను పూర్తిగా నివారించాలని డిమాండ్ చేశారు. అలాగే, తవ్విన రోడ్లను వెంటనే పునరుద్ధరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మిషన్ భగీరథ శాఖ అధికారులను కోరారు. "ప్రజల సొమ్ముతో నిర్మించిన రోడ్లను ధ్వంసం చేసి మరమ్మతులు చేయకపోవడం బాధ్యతారాహిత్యమే. వెంటనే చర్యలు తీసుకుని శాశ్వత పరిష్కారం చూపాలి" అని బొగ్గుల చందు పేర్కొన్నారు.

# ఉప్పల్ జోన్‌లో టెండర్ల గోల్మాల్

# 180 కోట్ల టెండర్లపై వివాదం

- **లంచాలు ఇచ్చిన వారికే టెండర్ల.?**
- **ఇంజనీరింగ్ అధికారుల అవినీతిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి**
- **అభివృద్ధి పేరుతో కోట్లు దండుకుంటున్న ఇంజనీరింగ్ అధికారులు**
- **అవినీతి అక్రమాలను కట్టడి చేయడంలో కమిషనర్ విఫలం**
- **సూపరింటెండెంట్ ఇంజనీర్ హరికృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ అవినాష్‌పై అవకతవకల ఆరోపణలు**
- **టెండర్ల ప్రక్రియలో సమగ్ర విచారణ జరిపించాలని కాప్రా సర్కిల్ బీజేపీ అధ్యక్షుడు సంగిశెట్టి రవీంద్రసాగర్ డిమాండ్**




నాచారం (ప్రశ్న న్యూస్) మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఉప్పల్ జోన్ పరిధిలో చేపట్టనున్న దాదాపు రూ.180 కోట్ల విలువైన అభివృద్ధి పనుల టెండర్ల ప్రక్రియపై తీవ్ర వివాదం నెలకొందని కంప్రెసర్ సర్కిల్ ప్రెజెంట్ సంఘశెట్టి రవీందర్ సాగర్ మీడియాకు తెలిపారు. ఈ టెండర్ల కేటాయింపులో భారీ స్థాయిలో అవకతవకలు జరిగాయని, కొందరు అధికారుల ప్రమేయంతో నిబంధనలను తుంగలో తొక్కి పనులను అనుకూల కాంట్రాక్టర్లకు కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని కాప్రా సర్కిల్ అధ్యక్షుడు సంగిశెట్టి రవీంద్రసాగర్ ఆరోపించారు. ఉప్పల్ జోన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ హరికృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ అవినాష్ కలిసి టెండర్ల ప్రక్రియలో పారదర్శకతకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు. ప్రజాధనం వినియోగంలో అత్యంత జాగ్రత్త అవసరమైన సమయంలో కొందరు అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు.

### "ఎవరికి లాభం చేకూర్చేందుకే టెండర్లా?"

-- రవీంద్రసాగర్ ప్రశ్నప్రజల పన్నుల రూపంలో సమకూరిన నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకత, పోటీ విధానాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉండగా, ఉప్పల్ జోన్‌లో మాత్రం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని రవీంద్రసాగర్ ఆరోపించారు. టెండర్ల ప్రక్రియలో కొన్ని సంస్థలకు అనుకూలంగా షరతులు రూపొందిస్తున్నారని, అర్హులైన కాంట్రాక్టర్లను పక్కనపెట్టి ముందుగానే నిర్ణయించిన వారికి పనులు అప్పగించేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

### అధికారుల కుమ్మక్కు వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం?

సూపరింటెండెంట్ ఇంజనీర్ హరికృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ అవినాష్ పరస్పర సహకారంతో టెండర్లలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని రవీంద్రసాగర్ ఆరోపించారు. టెండర్ల విలువ కోట్ల రూపాయల్లో ఉండటంతో ప్రభుత్వానికి భారీ ఆర్థిక నష్టం కలిగే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. పోటీని తగ్గించే విధంగా నిబంధనలు రూపొందించడం, కొందరు కాంట్రాక్టర్లకు సమాచారం ముందుగానే చేరవేయడం వంటి అంశాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు.

### "పారదర్శకత లేకుంటే అభివృద్ధి పేరుతో దోపిడీ"

ప్రజా నిధులతో చేపట్టే పనుల్లో పారదర్శకత లేకుంటే అది అభివృద్ధి కాదని, దోపిడీకి మార్గం సుగమం చేసినట్లేనని రవీంద్రసాగర్ అన్నారు. కోట్ల రూపాయల పనుల్లో నాణ్యత తగ్గితే



భవిష్యత్తులో ప్రజలే నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. టెండర్ల ప్రక్రియపై పూర్తిస్థాయి విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాలని ఆయన డిమాండ్ చేశారు.

### విజిలెన్స్, ఏసీబీ దర్యాప్తు జరపాలన్న డిమాండ్

రూ.180 కోట్ల టెండర్ల వ్యవహారంపై విజిలెన్స్ విభాగం, అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)తో పాటు ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని రవీంద్రసాగర్ కోరారు. టెండర్లకు సంబంధించిన అన్ని పత్రాలను బహిర్గతం చేసి, ఈ-టెండర్ ప్రక్రియలో పాల్గొన్న సంస్థల వివరాలను ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు.

### "నిజాయితీగా పనిచేసే అధికారుల ప్రతిష్ఠ దెబ్బతింటోంది"

కొంతమంది అధికారుల చర్యల కారణంగా నిజాయితీగా విధులు నిర్వర్తించే అధికారుల ప్రతిష్ఠ కూడా దెబ్బతింటోందని ఆయన అన్నారు. ప్రజా ప్రయోజనాలను పక్కనబెట్టి వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చే అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



### ప్రజా ప్రతినిధులు స్పందించాలని విజ్ఞప్తి

ఉప్పల్ జోన్ పరిధిలో జరుగుతున్న ఈ వ్యవహారంపై స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని రవీంద్రసాగర్ విజ్ఞప్తి చేశారు. కోట్ల రూపాయల ప్రజాధనం వినియోగంపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

### అధికారుల స్పందన తెలియాల్సి ఉంది

అయితే, ఈ ఆరోపణలపై ఉప్పల్ జోన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ హరికృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ అవినాష్ నుంచి అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది. ఆరోపణలకు సంబంధించి సంబంధిత అధికారులు వివరణ ఇస్తే పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# తాగుబోతులకు అడ్డాగా..

## వాహనాల పార్కింగ్‌గా మారిన గజ్వేల్ పాత మండల ప్రజా పరిషత్తు కార్యాలయము

**పునరుద్ధరించి ప్రజా అవసరాలకు వినియోగించాలంటూ స్థానికుల విజ్ఞప్తి**







గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పట్టణంలోని ఒకప్పుడు ప్రభుత్వ కార్యకలాపాలతో నిత్యం సందడిగా ఉండే గజ్వేల్ పాత మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయ భవనం ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ విశాలమైన రెండంతస్తుల భవనం ప్రస్తుతం రాత్రివేళల్లో తాగుబోతులకు అడ్డాగా, పగటి సమయంలో వాహనాల పార్కింగ్ స్థలంగా మారిందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త కార్యాలయ భవనాలు నిర్మాణం అనంతరం ఈ పాత భవనాన్ని పూర్తిగా విస్మరించడంతో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తి శిథిలావస్థకు చేరుకుంటోందని వారు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో భవనం పరిసరాలు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల అభిప్రాయం ప్రకారం, ఈ భవనం ఇప్పటికీ బలమైన నిర్మాణంతో ఉండటంతో దీనిని ప్రజా ప్రయోజనాలకు వినియోగించే అవకాశం ఉంది. ముఖ్యంగా నిరుద్యోగ యువత కోసం డిజిటల్ లైబ్రరీ, స్టడీ హాల్, మహిళలు మరియు యువత కోసం నైపుణ్యాభివృద్ధి కేంద్రం, లేదా ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సూచిస్తున్నారు. ప్రజాధనంతో నిర్మించిన భవనాలను నిరుపయోగంగా వదిలేయడం వల్ల ప్రభుత్వ ఆస్తి పాడవడమే కాకుండా, సామాజిక సమస్యలకు దారి తీసే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. అందువల్ల సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి పాత మండల ప్రజా పరిషత్తు కార్యాలయ భవనాన్ని పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గజ్వేల్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి "ప్రజాధనంతో నిర్మించిన పాత మండల ప్రజా పరిషత్తు భవనం కార్యాలయాన్ని వెంటనే పునరుద్ధరించి ప్రజా అవసరాలకు వినియోగించాలి" అని స్థానికులు కోరుతున్నారు.

## ధోలేరాపై పెట్టుబడిదారులకు అవగాహన




శేర్లింగంపల్లి( ప్రశ్న న్యూస్) గుజరాత్‌లో అభివృద్ధి చెందుతున్న ధోలేరా స్పెషల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్‌లో పెట్టుబడి అవకాశాలపై అవగాహన కల్పించేందుకు గచ్చిబౌలిలోని లీ మెరిడియన్ హోటల్‌లో ఇన్వెస్టర్ మీట్ నిర్వహించారు.నెస్టోరియా ఫార్చ్యూన్ పార్క్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ధోలేరా అభివృద్ధి ప్రణాళికలు, మౌలిక వసతులు, పారిశ్రామిక అవకాశాలపై వివరించారు. ఢిల్లీ--ముంబై పారిశ్రామిక కారిడార్ పరిధిలో అభివృద్ధి చెందుతున్న ధోలేరా భవిష్యత్ నగరంగా ఎదుగుతోందని తెలిపారు.అభివృద్ధి పనులకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించగా, పెట్టుబడిదారులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. దీర్ఘకాలిక పెట్టుబడుల విషయంలో ప్రాంత అభివృద్ధి, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలను పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

## ఈదురుగాలులతో దాసరి నరేష్ ఇంట్లో అగ్నిప్రమాదం

- లక్ష రూపాయల ఆస్తి నష్టం.. నగదు సహా సామగ్రి దగ్ధం
- ప్రభుత్వం ఆదుకోవాలని దాసరి నరేష్ విజ్ఞప్తి



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రానికి చెందిన దాసరి నరేష్ ఇంట్లో ఆదివారం కురిసిన వర్షం, తీవ్రమైన ఈదురుగాలుల నేపథ్యంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న ఫ్రిజ్, రెండు టీవీలు, ఫ్యాన్లు, బియ్యం, వస్త్రాలు, ఇతర గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. అలాగే ఇంట్లో ఉంచిన రూ.44 వేల నగదు కూడా కాలిపోయింది. మొత్తం సుమారు రూ.1 లక్ష మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధిత కుటుంబం తెలిపింది. ప్రభుత్వం, అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని బాధితుడు దాసరి నరేష్ విజ్ఞప్తి చేశారు.

## బాలిక పై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

- బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం
- పోక్సో కేసులో నిందితుడికి కఠిన శిక్ష
- దోషులకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్ సిబ్బంది కోర్టు అధికారులను అభినందించిన
- జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామనాథ్



ఏటూరు నాగారం (ప్రశ్న న్యూస్) కన్నాయిగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో 2023 సంవత్సరంలో నమోదైన క్రైం నెం.04/2023, భారతీయ శిక్ష స్మృతి మరియు పోక్సో చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద నమోదైన కేసులో విచారణ పూర్తి చేసి ములుగు ప్రత్యేక పోక్సో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడం జరిగింది.ఈ కేసులో నిందితుడు అయిన కొరగట్ల సత్యనారాయణ (45), కన్నాయిగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి. బాధితురాలిపై జరిగిన లైంగిక దాడి కేసును విచారించిన ములుగు ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎస్.వి.పి. సూర్య చంద్ర కళ నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష తో పాటు రూ.6,000 జరిమానా విధించారు. అదేవిధంగా బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించారు.ఈ కేసు దర్యాప్తులో మొదటి దర్యాప్తు అధికారి మరియు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అప్పటి ఎస్ఐ ఎం. సురేష్, తదుపరి దర్యాప్తు అధికారులు కె. శివప్రసాద్ సీఐ, ఎం. రాజు సీఐలు కీలక పాత్ర పోషించారు.కోర్టులో కేసు సమర్థవంతంగా నడిపించడంలో కోర్టు మానిటరింగ్ అధికారి డి ఎస్ పి కిషోర్ , కోర్టు లైజనింగ్ అధికారి ఎస్ ఐ నాగరాజు , సీడీఓ సిబ్బంది కానిస్టేబుల్ కె. మౌనిక, పీసీ జె. మంగీలాల్ విశేష కృషి చేశారు. జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ కేసు దర్యాప్తు అధికారులు, కోర్టు మానిటరింగ్ అధికారి, కోర్టు లైజనింగ్ అధికారి, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ మరియు కేసు విజయవంతమైన తీర్పుకు సహకరించిన పోలీసు సిబ్బందిని అభినందించారు.మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల పట్ల ములుగు జిల్లా పోలీసులు అత్యంత కఠినంగా వ్యవహరిస్తారని, బాధితులకు న్యాయం జరిగేలా ప్రతి కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

# ఏజెన్సీ విద్య పై సమీక్ష జరుపండి..

# ప్రాజెక్ట్ అధికారికి మెమోరాండం

- ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి
- ఏజెన్సీ విద్యను బలోపేతం చేయండి
- బాలకార్మికుల తయారీ కేంద్రాలుగా ఏకోపాధ్యాయ పాఠశాలు
- నేటికీ అడవికి చేరని అక్షరం

ఏటూరు నాగారం ( ప్రశ్న న్యూస్) దేశానికి స్వాతంత్ర్యం వచ్చి శతాబ్దానికి చేరువవుతున్నా తెలంగాణ ఏజెన్సీలోని అడవి బిడ్డలకు నేటికీ నాణ్యమైన విద్య అందడం లేదని, ఇది ఆదివాసీలకు జరుగుతున్న చారిత్రక అన్యాయమని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి ఆవేదన వ్యక్తం చేశారు.సోమవారం ఏటూరునాగారం ఐటీడీ ఏ ప్రాజెక్ట్ అధికారి లెనిన్ వత్సల్ టోప్పోను కలిసి ఏజెన్సీ విద్యలోని లోపాలపై, సమస్యల పై సమగ్ర మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లోపభూయిష్ట విధానాల కారణంగా ఏజెన్సీ విద్య ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోందని అన్నారు.

### ఏ ఎస్ ఈ ఆర్ నివేదికతో వెల్లడైన దుస్థితి..

"ఏ ఎస్ ఈ ఆర్-2024 నివేదిక ప్రకారం 5వ తరగతి విద్యార్థుల్లో 61 శాతం మందికి 2వ తరగతి తెలుగు పాఠం చదవడం రాదు. 71 శాతం మందికి సాధారణ తీసివేతలు చేయడం రావడం లేదు. పై తరగతులకు వెళ్లే కొద్దీ గిరిజన విద్యార్థుల డ్రాప్‌ఔట్ రేటు పెరిగిపోతోంది. కనీస అభ్యసన సామర్థ్యాలు పూర్తిగా లోపించాయి" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

### ఏకోపాధ్యాయ బడులు బాలకార్మిక కేంద్రాలుగా..

ఐటీడీ ఏ పరిధిలోని 194 గిరిజన ఆశ్రమ, ప్రాథమిక పాఠశాలల్లో 89 పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలేనని నర్సింహా మూర్తి తెలిపారు. "ఒక్క టీచర్ మీటింగ్‌కు వెళ్తే ఆ రోజు పాఠశాల మూతపడుతోంది. నెలలో 6 నుండి 8 రోజులు బడి నడవని పరిస్థితి. ఇవి బాలకార్మికులను తయారు చేసే ప్రభుత్వ కేంద్రాలుగా మారాయి" అని ఆయన ఆరోపించారు.

### 14 ఏళ్లుగా నియామకాలు లేవు..

2012 తర్వాత ఐటీడీఏ పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామకాలు జరగలేదని, ప్రస్తుతం 417 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. "సబ్జెక్ట్ టీచర్లు లేకపోవడంతో 8, 9, 10 తరగతుల్లో సైన్స్, మ్యాథ్స్, ఇంగ్లీష్ బోధన అసలే జరగడం లేదు. వెంటనే కాంట్రాక్ట్/సి ఆర్ టి విధానంలో పోస్టులు భర్తీ చేయాలి" అని డిమాండ్ చేశారు.

### అంతా అక్షరాస్యులే..

"ఐటీడీ ఏ పాఠశాలల్లో ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం ఏటా రూ.1,20,000 ఖర్చు చేస్తోంది. కానీ పిల్లలను అక్షరాస్యులుగా మాత్రమే చేస్తున్నారు, విద్యావంతులుగా కాదు. అక్షరాస్యత కోసం ఇంత ఖర్చు అవసరం లేదు, రాత్రి బడికి వెళ్లినా సరిపోతుంది" అని ఆయన ఎద్దేవా చేశారు.

### 80 శాతం రక్త హీనత..

ఐటీడీ ఏ పరిధిలో సుమారు 80 శాతం మంది విద్యార్థులు తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్నారని, సరైన పోషకాహారం అందక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. "వీరికి వారానికి 3 సార్లు గుడ్డు, 2 సార్లు చికెన్, రోజూ రాగిజావ, ఆకుకూరలతో కూడిన ప్రత్యేక మెనూ అమలు చేయాలి" అని కోరారు.




### పర్యవేక్షణ శూన్యం..

ఏ టి డి ఓ , టీటీడీఓ , డీడీ వంటి అధికారులు ఉన్నప్పటికీ ఐటీడీ ఏ పాఠశాలలను పర్యవేక్షించే సమయం వారికి లేదని ఆరోపించారు. కొంతమంది ఉపాధ్యాయులు వేల రూపాయలు జీతాలు తీసుకుంటూ పని దినాల్లో బయట తిరుగుతున్నారని, తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివిస్తూ పేద ఆదివాసీ బిడ్డలకు అన్యాయం చేస్తున్నారని ౹ా దృష్టికి తీసుకెళ్లారు. ఏకోపాధ్యాయ పాఠశాలలను వెంటనే రద్దు చేసి అదనపు టీచర్‌ను నియమించాలని, 417 ఖాళీ పోస్టులను 3 నెలల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో 100 శాతం స్థానిక ౹ు అభ్యర్థులతో భర్తీ చేయాలని, బయోమెట్రిక్ హాజరు అమలు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే టీచర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పనిదినాల్లో కొంతమంది ఉపాధ్యాయులు బడి బయట తిరుతున్నారని అలాంటి వారిని ఉపేక్షించరాదు అన్నారు."విద్యపై ఉపేక్షిస్తే అడవి బిడ్డలకు అన్యాయమే. నాణ్యమైన విద్య కోసం ఎవరినీ ఉపేక్షించొద్దు. 30 రోజుల్లో చర్యలు తీసుకోకపోతే ఐటీడీ ఏ కార్యాలయం ముందు శాంతియుత నిరాహార దీక్ష చేపడతాం" అని నర్సింహా మూర్తి హెచ్చరించారు.

## అక్రమ బంధానికి 'పసిప్రాణం' బలి!

- వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని రెండేళ్ల కొడుకును చంపిన కన్నతల్లి, ప్రియుడు
- కీసర పోలీసుల దర్యాప్తులో షాకింగ్ నిజాలు
- కేసును ఛేదించిన జవహర్ నగర్ ఏసిపి చక్రపాణి




కీసర (ప్రశ్న న్యూస్)మేడ్చల్ మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని కీసర పోలీస్ స్టేషన్‌లో సంచలనం సృష్టించిన రెండేళ్ల బాలుడి అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. తన అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే నెపంతో కన్నతల్లే ప్రియుడితో కలిసి కుమారుడిని అత్యంత దారుణంగా హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ ఘాతుకానికి ఒడిగట్టిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.

### ప్రమాదంగా నమ్మించే ప్రయత్నం..

జవహర్ నగర్ ఏసిపి చక్రపాణి తెలిపిన వివరాల ప్రకారం.. కీసర మండలం చిర్యాల గ్రామంలోని ఈడెన్ గార్డెన్స్‌కు చెందిన రంగా స్వామి, జ్యోతి దంపతులకు రెండేళ్ల కుమారుడు రంగా హరికృష్ణ ఉన్నాడు. మే 29న బాలుడు ఇంట్లో ప్రమాదవశాత్తు కింద పడిపోవడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడని, ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందాడని తల్లి జ్యోతి కుటుంబ సభ్యులను నమ్మించింది. దీంతో వారు బాలుడి అంత్యక్రియలు పూర్తి చేశారు.

### పోలీసుల లోతుగా దర్యాప్తు..

అయితే కుమారుడి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ తండ్రి రంగా స్వామి జూన్ 13న కీసర పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు కేసును అన్ని కోణాల్లో లోతుగా దర్యాప్తు చేశారు. ఘటనా స్థలంలోని సీసీటీవీ ఫుటేజ్, నిందితుల మొబైల్ సాంకేతిక ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించగా.. జ్యోతికి, మొగిళ్ల నవీన్ అనే వ్యక్తికి మధ్య వివాహేతర సంబంధం ఉన్నట్లు గమనించారు. ఘటన జరిగిన రోజున నవీన్ జ్యోతి ఇంటికి వచ్చినట్లు, అనంతరం బాలుడిని ఆసుపత్రికి తరలించడంలోనూ అతడు పాల్గొన్నట్లు విచారణలో తేలింది.

### మృతదేహం వెలికితీత.. నేరం అంగీకారం

అనుమానాలు బలపడటంతో పోలీసులు జూన్ 19న రెండేళ్ల బాలుడి మృతదేహాన్ని సమాధి నుంచి వెలికితీసి ఫోరెన్సిక్ నిపుణులతో పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసుల శైలి విచారణలో నిందితులు ఇద్దరూ తమ తప్పును అంగీకరించారు. తమ అక్రమ సంబంధానికి బాలుడు అడ్డుగా ఉన్నాడని భావించి ముందస్తు కుట్ర పన్నామన్నారు. ఘటన రోజున నవీన్ బాలుడిని నేలపై బలంగా కొట్టగా, జ్యోతి అందుకు సహకరించిందని, ఆపై అది ప్రమాదవశాత్తు జరిగినట్లు నాటకమాడామని ఒప్పుకున్నారు.ఈ కేసులో ప్రధాన నిందితులైన మొగిళ్ల నవీన్, రంగా జ్యోతిలను అరెస్ట్ చేసినట్లు, కేసు తదుపరి విచారణ కొనసాగుతోందని పోలీసులు స్పష్టం చేశారు. అమాయకపు చిన్నారిని పొట్టనబెట్టుకున్న నిందితులపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## కనీస వేతనాల సవరణకు అమలుకు కార్మిక ఐక్య పోరాటాలు

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కనీస వేతనాల సవరణ శాస్త్రీయబద్ధంగా లేదని, మరోసారి సమగ్రంగా సవరణ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు, గజ్వేల్ పారిశ్రామిక ప్రాంత ఇండస్ట్రియల్ క్లస్టర్ కన్వీనర్ బండ్ల స్వామి డిమాండ్ చేశారు. కనీస వేతనాలు అందని కార్మికులకు వాటి అమలు కోసం కార్మిక ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని ప్రకటించారు.ఆదివారం సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన తెలంగాణ స్టేట్ ఫిక్స్ టర్మ్ అండ్ నాన్ రెగ్యులర్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రథమ మహాసభలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్ పారిశ్రామిక ప్రాంతం వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, అనేక పరిశ్రమల్లో కార్మికులు కనీస వేతనాలు, కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పండుగలు, అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మేడే) సందర్భంగా కూడా అత్యవసర పనుల పేరుతో పరిశ్రమలను నడుపుతూ కార్మికులకు చట్టప్రకారం చెల్లించాల్సిన వేతనాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. పనిగంటలను యాజమాన్యాలు ఇష్టానుసారంగా అమలు చేస్తున్నాయని విమర్శించారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసేందుకు సిద్ధమవుతోందని, దీనివల్ల కార్మిక వర్గానికి నష్టం జరిగే అవకాశముందని అన్నారు. పారిశ్రామిక సంబంధాల కోడ్ ప్రకారం శాశ్వత ఉద్యోగాల స్థానంలో ఫిక్స్ టర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో తాత్కాలిక ఉద్యోగులను నియమించుకునే అవకాశం కల్పించారని, దీని వల్ల ఉద్యోగ భద్రత దెబ్బతింటుందని పేర్కొన్నారు.ఈ పరిస్థితులకు వ్యతిరేకంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ ఫిక్స్ టర్మ్ అండ్ నాన్ రెగ్యులర్ ఎంప్లాయిస్ యూనియన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ యూనియన్ ద్వారా గజ్వేల్ పారిశ్రామిక ప్రాంతంలోని కార్మికులకు కనీస వేతనాలు, సామాజిక భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, చట్టబద్ధమైన సెలవులు వంటి హక్కులు సాధించేందుకు కృషి చేస్తామని చెప్పారు.పరిశ్రమల్లో ప్రమాదాలు నివారించేందుకు భద్రతా ప్రమాణాలు అమలు చేయడం, కార్మికులకు రక్షణ పరికరాలు అందించడం కోసం కూడా ఉద్యమాలు చేపడతామని బండ్ల స్వామి స్పష్టం చేశారు.

## వనం,మనం ఒకటై ముందుకు సాగాలి

- ఎమ్మెల్యే శ్రీ గణేష్.
- వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటిన ఎమ్మెల్యే శ్రీగణేష్
- కాలనీలో,ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి పచ్చదనానికి పెద్ద పీఠం వెయ్యండి: ఎమ్మెల్యే



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవం - 2026 కార్యక్రమంలో భాగంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ సోమవారం మోండా డివిజన్,ఈస్ట్ మారేడ్‌పల్లి టీచర్స్ కాలనీ పార్క్‌లో హార్టీ కల్చరల్ అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ,మనం నాటే ప్రతి మొక్క రేపటి తరానికి ఆక్సిజన్ సిలిండర్ వంటిదని, వనమహోత్సవం స్ఫూర్తితో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, కాలుష్య రహిత కంటోన్మెంట్ సాధన కోసం ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో ఒక్క మొక్కైనా నాటి,దానిని సంరక్షించాలని,చెట్లను మనం రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయనిపిలుపునిచ్చారు.పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని,ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.మొక్కలు నాటడంతో పాటు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి,స్వచ్ఛమైన తెలంగాణ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు.ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాకు నాయక్,హార్టికల్చర్ అధికారి అనీల్,మోండా డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,సీనియర్ నాయకులు బద్రీ నాథ్ యాదవ్,సంతోష్ యాదవ్, వైష్ణవి యాదవ్, గణేష్ టెంపుల్ ఛైర్మన్ ప్రభాకర్ యాదవ్,బుల్లేట్ రవి తదితరులు పాల్గొన్నారు.

# 'మరీచిక' మూవీ రివ్యూ!



తెలుగు తెరపై కథానాయికలుగా అనుపమా పరమేశ్వరన్ - రెజీనా ఇద్దరూ తమ ప్రతిభను నిరూపించుకున్నవారే. ఇక 'బేబీ' సినిమాతో విరాజ్ అశ్విన్ మంచి క్రేజ్ ను సంపాదించుకున్నాడు. అలాంటి ఈ ముగ్గురూ ప్రధానమైన పాత్రలను పోషించిన సినిమానే 'మరీచిక'. సతీశ్ కాశెట్టి దర్శకత్వం వహించిన ఈ సినిమా, మే 29వ తేదీన థియేటర్లలో విడుదలైంది. మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్ జోనర్లో నిర్మితమైన ఈ సినిమా, ఈ నెల 19వ తేదీ నుంచి 'అమెజాన్ ప్రైమ్' లో స్ట్రీమింగ్ అవుతోంది. హైదరాబాద్ లోని ఒక డిగ్రీ కాలేజ్ లో వెంకటలక్ష్మి (అనుపమా పరమేశ్వరన్) చదువుతూ ఉంటుంది. అక్కడికి దగ్గరలోనే సంజయ్ ( విరాజ్ అశ్విన్) ఒక కాఫీ షాప్ ను నిర్వహిస్తుంటాడు. తొలిచూపులోనే సంజూపై మనసు పారేసుకున్న వెంకటలక్ష్మీ, అతనికి చేరువ కావడానికి ప్రయత్నిస్తూ ఉంటుంది. అలాంటి సమయంలోనే అమెరికా నుంచి వచ్చిన 'మరీచిక' (రెజీనా)తో వెంకటలక్ష్మీకి పరిచయమవుతుంది. చాలా తక్కువ రోజులలోనే వాళ్లిద్దరి మధ్య ఎక్కువ సాన్నిహిత్యం పెరిగిపోతుంది. తల్లిదండ్రులను కోల్పోయిన 'మరీచిక', హైదరాబాద్ లోని తన ఆస్తులను అమ్మేసుకుని తిరిగి అమెరికా వెళ్లే ఆలోచనలో ఉందని వెంకటలక్ష్మి తెలుసుకుంటుంది. వెంకటలక్ష్మితో పాటు తన కాఫీ షాప్ కి వచ్చిన మరీచికతో సంజూ మాటలు కలుపుతాడు. వాళ్లిద్దరి మధ్య పరిచయం చాలా ఫాస్టుగా ప్రేమగా మారిపోతుంది. అయితే సంజూ తనకి దక్కకుండా పోతుండటాన్ని వెంకటలక్ష్మీ భరించలేకపోతుంది. వాళ్లిద్దరూ గుళ్లో చేసుకున్న పెళ్లికి ఆమె ఒక ప్రధానమైన సాక్షిగా ఉండిపోతుంది. ఒకానొక సమయంలో తనకి మరీచిక చెప్పిన మాటలన్నీ అసత్యాలని వెంకటలక్ష్మి తెలుసుకుంటుంది. ఆ సమాచారాన్ని రహస్యంగా సంజూకి చేరవేస్తుంది. అయితే ఆ విషయాన్ని గ్రహించిన మరీచిక, హనీమూన్ పేరుతో సంజూని బయల్దేరదీస్తుంది. పొలిమేరలలోకి వెళ్లగానే సంజూపై ఎటాక్ చేస్తుంది. సంజూ స్నేహితులను తన వైపుకు తిప్పుకుని, వాళ్లతో కలిసి అతణ్ణి హత్య చేస్తుంది. ఈ దృశ్యాన్ని చూసిన వెంకటలక్ష్మీ ఏం చేస్తుంది? పర్యవసానంగా చోటుచేసుకునే సంఘటనలు ఎలాంటివి? అనేది కథ. ఇది ట్రయాంగిల్ లవ్ స్టోరీగా మొదలవుతుంది. సంజూను వెంకటలక్ష్మి ప్రేమించడం .. ఆమె స్నేహితురాలైన 'మరీచిక'ను సంజూ లవ్ చేయడం .. ఈ ఇద్దరి సాన్నిహిత్యాన్ని చూస్తూ వెంకటలక్ష్మి రగిలిపోవడం వంటి సన్నివేశాలతో ఈ కథ నడుస్తూ ఉంటుంది. సంజూని ఒక పథకం ప్రకారం మరీచిక హత్య చేసిందంటూ పోలీస్ స్టేషన్ కి వెంకటలక్ష్మీ పరిగెత్తుకు రావడంతో కథలో ఆసక్తికరమైన అంశం మొదలవుతుంది. ఆస్తుల కోసం మరీచికను సంజూ వలలో వేసుకుంటున్నాడా? లేదంటే అతని దగ్గరున్న కోట్ల రూపాయలను కొల్లగొట్టడానికి మరీచిక ప్లాన్ చేసిందా? అనే ఒక సందేహం ఆడియన్స్ ను వెంటాడుతూ ఉంటుంది. మానసిక పరమైన ఒక వ్యాధితో వెంకటలక్ష్మి బాధపడుతుందంటూ ఇచ్చిన ట్విస్ట్ తో కథ మరో మలుపు తీసుకుని ఆడియన్స్ కి మరో క్వశ్చన్ మార్క్ వదులుతుంది. ప్రతిసారి పోలీస్ స్టేషన్ కి వెళ్లిన తరువాత, అంతకుముందు జరిగిన కథలోని సన్నివేశాలు మారిపోతూ వెళ్లడం ఉత్కంఠను పెంచుతుంది. ఇక ఈ కథ ప్రీ క్లైమాక్స్ కి చేరుకుంటూ ఉండగా, హారర్ టచ్ కూడా ఇచ్చేశారు. దాంతో క్రైమ్ థ్రిల్లర్ .. మిస్టరీ థ్రిల్లర్ .. హారర్ థ్రిల్లర్ అంశాలను ఒకే కథలో కలిపేసి అందించినట్టుగా అనిపిస్తుంది. కథ చకచకా మలుపులు తీసుకుంటూ ఉంటుంది. ఏది నిజం? ఏది అబద్ధం? అనేది తేల్చుకోనీయని ఒక గందరగోళంలో నుంచి ఉత్కంఠను వెలికి తీయడానికి ప్రయత్నిస్తుంది. అయినా రొటీన్ బారి నుంచి తప్పించుకోలేకపోతుంది. ఈ కథ ఎక్కడెక్కడో తిరుగుతూ చివరికి పోలీస్ స్టేషన్ కి చేరుకుంటూ ఉంటుంది. అయితే పోలీసులు అక్కడికి వచ్చిన వాళ్లను ప్రశ్నించి అప్పటికప్పుడే నిర్ణయాలు తీసేసుకుంటూ ఉంటారు. ఇన్వెస్టిగేషన్ కోసం క్లైమాక్స్ లో గానీ కాలు బయటికి పెట్టరు. ఇలాంటి లాజిక్కులు పట్టించుకోకుండా ఫాలో అయితే ఓ మాదిరిగా అనిపించే కంటెంట్ ఇది. రెజీనా .. అనుపమా పరమేశ్వరన్ .. విరాజ్ .. అజయ్ ఘోష్ నటన ఆకట్టుకుంటుంది. అరవింద్ ఫొటోగ్రఫీ .. ఇళయరాజా సంగీతం .. జునైద్ సిద్ధికీ ఎడిటింగ్ ఫరవాలేదు. 'మరీచిక' అంటే 'ఎండమావి' అని అర్థం. దూరం నుంచి చూస్తే నీళ్లు ఉన్నట్టుగా కనిపిస్తాయి. అక్కడివరకూ వెళితే అక్కడి నుంచి మరికొంత దూరంలో ఉన్నట్టుగా అనిపిస్తాయి. అలా ఇదే నిజం అనుకోగానే అసలు జరిగింది ఇది అంటూ మరో అంశం తెరపైకి వస్తుంది. ఆ రకంగా చూసుకుంటే టైటిల్ సెట్ అయిందనే చెప్పాలి. ట్రయాంగిల్ లవ్ స్టోరీలా మొదలుపెట్టి, ఆ తరువాత క్రైమ్ .. హారర్ .. ఎమోషన్ టచ్ ఇస్తూ వెళ్లిన తీరు బాగానే ఉంది. కానీ ఏ అంశానికి సంబంధించి కూడా గాఢత కనిపించదు. హృదయానికి హత్తుకునే అంశాలు లేకపోవడం .. లాజిక్ కి అందని సన్నివేశాలు ఎక్కువ సమయాన్ని తీసుకోవడం .. ఎటొచ్చి రొటీన్ బారిన పడటం అసంతృప్తిని కలిగిస్తుంది.

# 3డీ ఫార్మాట్‌లో హను-మాన్

యువ హీరో తేజ సజ్జా కథానాయకుడిగా, ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో కె.నిరంజన్‌రెడ్డి నిర్మించిన 'హను-మాన్' చిత్రం పానిండియా స్థాయిలో సాధించిన విజయం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 2024లో విడుదలై దేశవ్యాప్తంగా రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్లను రాబట్టిన ఈ చిత్రాన్ని ఈ నెల 25న 3డీ ఫార్మాట్‌లో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈవెంట్‌కి హీరో సాయిదుర్గతేజ్ అతిథిగా విచ్చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. ఎంతో పుణ్యం చేసుకుంటే తప్ప ఇలాంటి సినిమా దొరకదని, ఇలాంటి సినిమాలో నటించే అవకాశం రావడమే అదృష్టమని హీరో తేజ సజ్జా అన్నారు. ఇంకా నిర్మాతలు నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి, హీరోయిన్ అమృత అయ్యర్, సంగీత దర్శకుడు గౌర హర, 3డీ కిరణ్ కూడా మాట్లాడారు.



# ఓ సుకుమారీ.. కన్నుల దారి.. నీవైపే చేరి



తిరువీర్, ఐశ్వర్య రాజేష్ జంటగా నటిస్తున్న గ్రామీణ నేపథ్య రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'ఓ..! సుకుమారి'. భరత్ దర్శన్ దర్శకుడు. మహేశ్వరరెడ్డి మూలి నిర్మాత. ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమా నుంచి టైటిల్ సాంగ్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'హే.. ఓ సుకుమారీ.. కన్నుల దారీ.. నీవైపే చేరే సుందరీ..' అంటూ సాగే ఈ పాటను పూర్ణాచారి రాయగా, భరత్ మంచిరాజు స్వరపరిచారు. అభిజిత్‌రావు ఆలపించారు ప్రేమలోని మాధుర్యాన్ని అందంగా ప్రజెంట్ చేస్తూ, స్వచ్ఛమైన ప్రేమగీతంలా ఈ పాట సాగింది. తిరువీర్, ఐశ్వర్య రాజేష్ తమ అభినయంతో ఆకట్టుకున్నారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రంలో మురళీధర్‌గౌడ్, ఆమని, విష్ణు ఓయ్, ఝాన్సీ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సీహెచ్ కుషేందర్.

## నాతో నేను గడిపేందుకే ఈ నిర్ణయం



యువతలో మంచి క్రేజ్ ఉన్న కథానాయికల్లో కయాదు లోహర్ ఒకరు. ప్రస్తుతం తెలుగు, తమిళ సినిమాలతో ఈ అందాలభామ బిజీబిజీగా ఉన్నది. తాజాగా ఈ ముద్దుగుమ్మ సోషల్ మీడియాకు కొన్నాళ్లు బ్రేక్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నది. ఈ విషయాన్ని తెలియజేస్తూ తన ఇన్‌స్టాలో ఓ పోస్ట్‌ని జత చేసింది. 'సోషల్‌మీడియా నుంచి ఒక అడుగు వెనక్కి వేస్తున్నాను. శరీరం మాదిరిగానే మనసుకు కూడా విశ్రాంతి అవసరం. నాతో నేను ఎక్కువగా గడిపేందుకు తీసుకున్న నిర్ణయం ఇది. ఇప్పటిదాకా సహకరించిన మిత్రులందరికీ ధన్యవాదాలు. మళ్లీ కలవాలని అనిపిస్తే తప్పకుండా కలుస్తా' అంటూ రాసుకొచ్చింది కయాదు లోహర్. సో.. కొన్నాళ్లపాటు ఈ యంగ్ బ్యూటీ సోషల్ మీడియాలో ఉండదన్నమాట. ప్రస్తుతం నాని 'ది ప్యారడైజ్'లో కయాదు కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే.

# అదరగొడుతున్న 'జిగితార'..

## కిరణ్ అబ్బవరం కొత్త పాటకు సూపర్ రెస్పాన్స్




యంగ్ హీరో కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా, 'బేబీ' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాన్ని అందించిన నిర్మాతలు సాయి రాజేష్, ఎస్.కె.ఎన్. నిర్మిస్తున్న తాజా చిత్రం 'చెన్నై లవ్ స్టోరీ'. ఈ సినిమా నుంచి విడుదలైన తొలి పాట 'జిగితార' సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటూ సినిమాపై అంచనాలను పెంచుతోంది. తిరుపతిలో జరిగిన ఓ భారీ సంగీత కార్యక్రమంలో ఈ పాటను చిత్ర బృందం ఘనంగా విడుదల చేసింది.

ప్రేమలో ఉన్న ఓ యువకుడు తన మనసులోని భావాలను వ్యక్తపరిచేలా ఈ 'జిగితార' పాటను అద్భుతంగా చిత్రీకరించారు. లెజెండరీ సంగీత దర్శకుడు మణిశర్మ అందించిన మనోహరమైన మెలోడీ సంగీతం ఈ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్రముఖ గాయకుడు కార్తీక్ తన మధురమైన స్వరంతో పాటకు ప్రాణం పోశాడు. అనంత శ్రీరామ్ రాసిన సాహిత్యం పాటలోని భావోద్వేగాలను లోతుగా ఆవిష్కరించింది. విడుదలైన క్షణం నుంచి సోషల్ మీడియాలో ఈ పాటకు అద్భుతమైన స్పందన వస్తోంది. మణిశర్మ, కార్తీక్, కిరణ్ అబ్బవరం కాంబినేషన్‌ను అభినందిస్తూ శ్రోతలు కామెంట్లు పెడుతున్నారు.ప్రేమ, కుటుంబ బంధాల చుట్టూ తిరిగే రొమాంటిక్ డ్రామాగా 'చెన్నై లవ్ స్టోరీ' తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో కిరణ్ అబ్బవరం సరసన శ్రీ గౌరీ ప్రియ హీరోయిన్‌గా నటిస్తున్నారు. సాయి రాజేష్ కథ అందించగా, రవి నంబూరి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్లపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వరుస విజయాలతో దూసుకుపోతున్న కిరణ్ అబ్బవరం కెరీర్‌కు ఈ సినిమా మరో మైలురాయి అవుతుందని అభిమానులు భావిస్తున్నారు.ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రాన్ని జూలై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. సినిమా విడుదలకు ముందే 'జిగితర' పాట రూపంలో వచ్చిన ఈ సానుకూల స్పందన, సినిమాపై ఉన్న బజ్‌ను మరింత పెంచుతోంది.

# రొమాంటిక్‌గా రాజా ది రాజా



రుత్విక్, విశాఖ దీమన్ జంటగా నటిస్తున్న యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'రాజా ది రాజా'. అనిల్ బోయిడపు దర్శకుడు. కె.నిహారిక దాసరి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని కె.శ్రీలతారెడ్డి సమర్పిస్తున్నారు. జూలై 17న సినిమా విడుదల కానున్నది. ప్రతిష్టాత్మక మైత్రీ డిస్ట్రిబ్యూటర్స్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తుండటం విశేషం. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్ కలర్‌ఫుల్ విజువల్స్‌తో రొమాంటిక్ మూడ్‌ని ప్రజెంట్ చేస్తున్నది. డా.నరేష్ విజయకృష్ణ, సాయికుమార్, అవసరాల శ్రీనివాస్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రవికిరణ్ బోయిడపు, సంగీతం: మార్క్ కె.రాబిన్, నిర్మాణం: బృందావన్ క్రియేషన్స్.

# నుదుటిపై నాన్న ముద్దు



తన శైలికి భిన్నంగా భక్తి, భావోద్వేగాలతో కూడుకున్న యాక్షన్ కథాంశంతో అగ్ర హీరో రవితేజ నటిస్తున్న చిత్రం 'ఇరుముడి'. ఇందులో కూతురంటే ప్రాణమిచ్చే తండ్రిగా ఆయన కనిపిస్తారు. శివ నిర్వాణ దర్శకుడు. ఆగస్ట్ 21న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నది. ఫాదర్స్ డే సందర్భంగా 'ఇరుముడి' చిత్రబృందం ఓ అందమైన ప్రత్యేక పోస్టర్‌ని విడుదల చేసింది. కూతురి నుదుటిపై ముద్దిస్తున్న నాన్నలా రవితేజ ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. తండ్రీకూతుళ్ల అనుబంధం, ప్రేమ, ఆప్యాయతలను ఈ పోస్టర్ హృద్యంగా ఆవిష్కరించింది. మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఓ ఆడపిల్ల తండ్రిగా రవితేజ నట విశ్వరూపాన్ని ఈ సినిమాలో చూస్తారని, కమర్షియల్ అంశాలన్నీ సమపాళ్లలో రంగరించిన చిత్రమిదని మేకర్స్ చెబుతున్నారు. ప్రియా భవానీశంకర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో సాయికుమార్, అజయ్‌ఘోష్, రమేశ్ ఇందిర, స్వాసిక, బేబీ నక్షత్ర కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: విష్ణుశర్మ, సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, నిర్మాణం: మైత్రీమూవీమేకర్స్.

# ధాన్యం కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

**- రైతుల సమస్యల పరిష్కారానికి టీఆర్ఎస్ కట్టుబడి ఉంది**

**- తెలంగాణ రక్షణ సేన జిల్లా ఇంచార్జి : మజీద్**




సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో రూ.91 లక్షల స్కాం మాత్రమే కాకుండా రూ.5 నుంచి రూ.6 కోట్ల వరకు కుంభకోణం జరిగిందనే అనుమానాలు ఉన్నాయని, ఇందులో ప్రమేయం ఉన్న రాజకీయ నాయకులు, అధికారులు సహా అందరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జిల్లా ఇంచార్జి మజీద్ డిమాండ్ చేశారు.సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ధాన్యం అక్రమ రవాణా కేసులో ఆరుగురిని అరెస్టు చేసి రూ.14.16 లక్షల నగదు స్వాధీనం చేసుకోవడంతో పాటు బ్యాంకు ఖాతాల్లోని రూ.46.21 లక్షలను సీజ్ చేసిన పోలీసు శాఖను అభినందించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా ఉన్నప్పటికీ ఇంత పెద్ద కుంభకోణం జరగడం ఆందోళనకరమన్నారు.టీఆర్ఎస్ అధినేత కవితక్క రైతుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నారని, రైతులకు అండగా నిలుస్తారని తెలిపారు. కుంభకోణంలో ఎవరున్నా గుర్తించి శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో కదిరే భాస్కర్, సయ్యద్ జావిద్, ఓర్సు అశోక్, బైరి రాజేష్, సయ్యద్ మౌలా, తోట కనకయ్య, అంతర్పుల బాబు, బండి శ్రీహరి, మండేపల్లి రవి పాల్గొన్నారు.

# విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**- మండల వ్యవసాయ అధికారి : ప్రణీత**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని రైతువేదికలో ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు విత్తన మేళా నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి ప్రణీత తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు నిర్వహిస్తున్న ఈ మేళాలో ప్రభుత్వం సూచించిన 7 సన్న రకాల నాణ్యమైన వరి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.రైతులు తమకు అవసరమైన విత్తనాలను ఒకే చోట కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించబడిందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మండలంలోని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని తమకు అవసరమైన వరి విత్తనాలను కొనుగోలు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రణీత పత్రికా ప్రకటనలో కోరారు.

# ఆది శ్రీనివాస్ పై దుష్ప్రచారం రాజకీయ కక్షే

**- ధాన్యం కేసుతో ఆది శ్రీనివాస్ కు సంబంధం లేదు**

**- కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షులు : తూమ్ మధు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌పై జరుగుతున్న దుష్ప్రచారం రాజకీయ కక్షసాధింపులో భాగమేనని వేములవాడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్ మధు విమర్శించారు. ప్రజల్లో ఎమ్మెల్యేకు పెరుగుతున్న ఆదరణను తట్టుకోలేక కొందరు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.ఇటీవల వెలుగులోకి వచ్చిన ధాన్యం అక్రమ రవాణా కేసుతో ఆది శ్రీనివాస్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కేసులో నిందితుడి కుటుంబ సభ్యుడు కాంగ్రెస్‌కు చెందిన వ్యక్తి కావడాన్ని ఆసరాగా చేసుకుని ఎమ్మెల్యే పేరును వివాదంలోకి లాగడం సరైనది కాదన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న ఆది శ్రీనివాస్ ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతో అసత్య ప్రచారం జరుగుతోందని పేర్కొన్నారు. రాజకీయ ప్రత్యర్థులు వ్యక్తిగత విమర్శలు మానుకుని ప్రజా సమస్యలపై పోటీ పడాలని, నిజం ఎప్పటికైనా గెలుస్తుందని తుమ్ మధు అన్నారు.

# మిడ్ మానేరు వద్ద కాంగ్రెస్ శ్రేణుల నిరసన

**- పంచామృతంతో జలాశయం శుద్ధి**

**-నిర్వాసితుల త్యాగాలను అవమానించొద్దు**

**- కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లాధ్యక్షులు : కూస రవీందర్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం,కొదురుపాక శ్రీ రాజరాజేశ్వర మధ్య మానేరు జలాశయం ఎండిన ప్రాంతంలో మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ క్రికెట్, కబడ్డీ ఆడడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు, నిర్వాసితులు ఆదివారం జలాశయం వద్ద ఆందోళన నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకుల చర్యలు నిర్వాసితుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఆరోపిస్తూ పంచామృతంతో జలాశయాన్ని శుద్ధి చేశారు.బీసీ సెల్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్ ఆధ్వర్యంలో కరీంనగర్ కార్పొరేటర్ వారాల నర్సింగం, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, నిర్వాసితులతో కలిసి జలాశయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా కూస రవీందర్ మాట్లాడుతూ, మిడ్ మానేరు ముంపు గ్రామాల ప్రజల త్యాగాలను గౌరవించకుండా బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జలాశయంలో నీరు ఉన్నప్పటికీ ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు.నిర్వాసితులకు పరిహారం విషయంలో గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు వస్తున్న ఆదరణను చూసి బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలకు దిగుతున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, మాజీ సర్పంచ్ రామిడి శ్రీనివాస్, నాగుల వంశీగౌడ్,ఎమిరెడ్డి సురేందర్ రెడ్డి, కొప్పుల నగేష్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, ఏఎంసీ డైరెక్టర్ రమేష్, ముంపు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# మొక్కనాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపునిచ్చిన గుంటి శంకర్

**- మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం**

**- బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధానకార్యదర్శి : గుంటి శంకర్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్ తన జన్మదిన వేడుకలను పురస్కరించుకొని గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన ఈ హరిత ఉద్యమంలో భాగంగా తన ఇంటి ఆవరణలో మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా గుంటి శంకర్ మాట్లాడుతూ, ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పులు ఆందోళన కలిగిస్తున్నాయని, భవిష్యత్ తరాలకు మెరుగైన వాతావరణాన్ని అందించాలంటే హరితహారం వంటి కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. పర్యావరణ ప్రేమికుడు జోగినిపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సమాజంలో మంచి చైతన్యాన్ని తీసుకొస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లెంకల సత్యనారాయణ రెడ్డి, సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అక్కెనపల్లి కర్ణాకర్, బత్తిని కమల్ గౌడ్, కన్నం సాగర్,గురిజాల కోటి, సిద్దు, మధు, ఎండీ రషీద్ తదితరులు పాల్గొని గుంటి శంకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# భార్య హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**రూ.10 వేల జరిమానా విధించిన జిల్లా న్యాయస్థానం**

**జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు,**




మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) భార్య అక్రమ సంబంధం పెట్టుకుందనే అనుమానంతో హత్య చేసిన ఘటనలో నిందితుడికి జిల్లా న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు రూ.10 వేల జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు.ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపురం గ్రామానికి చెందిన లక్ష్మికి సుమారు 20 సంవత్సరాల క్రితం రేగోడ్ మండలం చౌదరిపల్లి గ్రామానికి చెందిన కూతూరి కేశయ్యతో వివాహం జరిగింది. కొంతకాలం సజావుగా సాగిన వీరి దాంపత్య జీవితంలో, భార్య అక్రమ సంబంధం పెట్టుకుందనే అనుమానంతో కేశయ్య ఎనిమిదేళ్ల క్రితం ఆమె నుంచి విడిపోయాడు. అనంతరం లక్ష్మి తన తల్లిదండ్రుల వద్ద ఉంటూ కూలి పనులు చేస్తూ ఇద్దరు కుమారులను పోషించుకుంటూ జీవనం సాగిస్తోంది.2023 జనవరి 16న మేనమామను చూసి తిరిగి ఆటోలో వస్తుండగా, వాగు సమీపంలో కాపుకాసిన కేశయ్య ఆటోను అడ్డగించి, ఆటో డ్రైవర్‌ను కత్తితో బెదిరించి పంపించాడు. అనంతరం లక్ష్మిపై కత్తితో దాడి చేసి హత్య చేయడంతో పాటు, ఆమె అక్కపై కూడా దాడి చేశాడు.కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అదే రోజు రేగోడ్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సత్యనారాయణ కేసు నమోదు చేశారు. అప్పటి దర్యాప్తు అధికారి, అల్లాదుర్గం సీఐ జార్జ్ కేసులో పూర్తి దర్యాప్తు చేసి సాక్ష్యాధారాలు సేకరించి న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రస్తుత దర్యాప్తు అధికారి రేణుకారెడ్డి సాక్షులను కోర్ట్ లో ప్రవేశపెట్టారు. విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ బలమైన వాదనలు వినిపించారు. కోర్టు లైజనింగ్ అధికారి ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీవో వినోద్ సమన్వయంతో కేసు విచారణ జరిగింది.కేసులో సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి నీలిమ నిందితుడు కూతూరి కేశయ్యను దోషిగా నిర్ధారించి జీవిత ఖైదుతో పాటు రూ.10,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారాని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ సందర్భంగా కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు లైజనింగ్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# దెబ్బతిన్న విద్యుత్ లైన్ల పునరుద్ధరణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు

**- విద్యుత్ లైన్ల పునరుద్ధరణ పనులను పరిశీలించిన ఎస్ఈ : వేణుమాధవ్**





బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలంలో ఆదివారం రాత్రి వీచిన బలమైన గాలుల కారణంగా పలు గ్రామాల్లో 11 కేవీ, ఎల్‌టీ విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే టీజీఎన్‌పీడీసీఎల్ విద్యుత్ సిబ్బంది ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు రంగంలోకి దిగి ప్రజలు, రైతులకు ఇబ్బందులు కలగకుండా రాత్రి నుంచే దెబ్బతిన్న స్తంభాల స్థానంలో కొత్త పోల్స్ ఏర్పాటు చేస్తూ పునరుద్ధరణ పనులు చేపట్టారు.జరుగుతున్న పనులను జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ వేణుమాధవ్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే విలాసాగర్ సబ్‌స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న పీటీఆర్ పనులను కూడా ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్ వెంకటరమణ, సబ్ డివిజనల్ ఇంజనీర్ అనిల్ కుమార్,బోయినిపల్లి ఏఈ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మైనంపల్లి హనుమంతరావుపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన

**డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశంలో నిర్వహించిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక రాష్ట్ర నాయకులు మైనంపల్లి హన్మంతరావు పై కేటీఆర్ బ్యాచ్ గ్లోబల్ ప్రచారం చేస్తుందని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తు మీలా కమిషన్లు తీసుకొని,బ్రోకర్ బ్రోకర్ వ్యవహారం కాంగ్రెస్ పార్టీ నేతలకు రాదని అన్నారు.మెదక్ ధాన్యం కొనుగోళ్లు చేయడం లేదని ఆరోపించడం సరి కాదు అన్నారు. జిల్లాలో ఎన్నడూ లేని విధంగా ఈ యాసంగిలో 4.18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చిందని, రికార్డు స్థాయిలో ధాన్యం రావడం వల్ల కొంత ఆలస్యం అయిందన్నారు. రైతుల సమస్య కోసం కాంగ్రెస్ పార్టీయే ముందుగా ధర్నా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పటి వరకు 90 శాతం మంది రైతులకు ధాన్యం డబ్బులు ఖాతాల్లో జమ చేసినట్టు చెప్పారు. ఇప్పటి వరకు మెదక్లో వెయ్యి కోట్ల అభివృద్ధి జరిగిందని, కావాలంటే నిధుల వివరాలు బీఆర్ఎఎస్ నేతలకు పంపిస్తామని చెప్పారు. గతంలో వారి పాలనలో జరిగినట్టు ఇసుక అమ్మకోలేదని, మెదక్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు తరలిపోలేదన్నారు. అప్పుడు మీరు మీ షాడో ఎమ్మెల్యే ఏమి చేశారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే టిక్కెట్ పరేషాన్ వల్ల ఆమె మాట్లాడుతుందని ఎద్దేవా చేశారు. వర్షాకాలంలో ప్రాణాలకు తెగించి వరదల్లో చిక్కుకున్న వారిని మా నేత దగ్గర ఉంది కాపాడదని, తమంత వెంటే ఉన్నామన్నారు. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెదక్ వచ్చి రివ్యూ చేసిన విషయం బీఆర్ఎస్ నేతలు మరచిపోయినట్లు ఉన్నారని, అందుకే వరదలు వచ్చిన పట్టించుకోనట్లు మాట్లాడుతున్నారని అన్నారు. ప్రభుత్వం కార్యాలయాలు తరలిపోతుంటే చేతులు ముడుచుకు కూర్చున్న మీరు ఇప్పుడు అభివృద్ధి లేదని ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మెదక్ నియోజక వర్గంలో జరిగిన అభివృద్ధిపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, చర్చకు రావాలని పిలుపునిచ్చారు. మెదక్లో జరిగిన అభివృద్ధి వివరాలు బీఆర్ఎస్ నేతలకు పంపిస్తామని, అప్పుడే జరిగిన అభివృద్ధి తెలుస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ నరేశ్ గౌడ్,మెదక్ పట్టణ అధ్యక్షులు గంగాధర్, మాజీ చైర్మన్ రాగి అశోక్, హఫీజ్, నాగరాజు, రమేష్, మహిపాల్ రెడ్డి, శ్రీకాంత్, తాహెర్, విశ్వం, రాజశేఖర్, కౌన్సిలర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొనారు.

# అసంపూర్తి బ్రిడ్జీ నిర్మాణంతో ప్రజలకు ఇబ్బందులు - కలెక్టర్ కు ఫిర్యాదు

**- ప్రజల ప్రయాణ కష్టాలు తొలగించండి**

**- సత్వరమే బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయండి**

**- బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత : అక్కెనపల్లి కరుణాకర్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, స్తంభంపల్లి గ్రామంలోని గంజి వాగుపై నిర్మాణంలో ఉన్న హై - లెవెల్ వంతెన పనులను వెంటనే పూర్తి చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అక్కెనపల్లి కరుణాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.వంతెన నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో చిన్నపాటి వర్షాలకు కూడా రాకపోకలు నిలిచిపోతున్నాయని అన్నారు. దీంతో వాహనదారులు,గర్భిణీలు,విద్యార్థులు,రైతులు,కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ వంతెన ద్వారా రెండు నియోజకవర్గాల ప్రజలు ప్రయాణిస్తున్నందున పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు.అలాగే వంతెనపై ఉన్న విద్యుత్ తీగలను తొలగించి, మిగిలిన పనులను వెంటనే చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్‌ను కోరినట్లు అక్కెనపల్లి కరుణాకర్ తెలిపారు.

# రైతుల కోసం విత్తనాల మేళా.. నాణ్యమైన విత్తనాలకు అవకాశం

**- సన్న రకం వరికి బోనస్**

**- ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని**


**ఏడీఏ బాబు నాయక్ సూచన**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు పాటించి, ప్రభుత్వ సూచనలను అనుసరిస్తే మెరుగైన దిగుబడులతో పాటు అధిక ఆదాయం పొందవచ్చని గజ్వేల్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు (ఏడీఏ) బాబు నాయక్ తెలిపారు.సోమవారం గజ్వేల్ వ్యవసాయ శాఖ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలను రైతు సేవా కేంద్రాలు, గుర్తింపు పొందిన డీలర్ల వద్ద అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. నాణ్యమైన, ధృవీకరించిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని, బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న సన్న రకం వరి సాగును రైతులు విస్తృతంగా చేపట్టాలని కోరారు. సన్న రకం వరి పండించే రైతులకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందజేస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. మార్కెట్‌లో సన్న బియ్యానికి పెరుగుతున్న డిమాండ్ రైతులకు అదనపు లాభాలను తెచ్చిపెట్టే అవకాశముందని పేర్కొన్నారు.వాతావరణ పరిస్థితులు, వర్షపాతం అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని కంది, పెసర, మినుములు, నువ్వులు వంటి ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని రైతులకు సూచించారు. ఈ పంటలు తక్కువ నీటితో సాగవడంతో పాటు సాగు ఖర్చులు కూడా తగ్గుతాయని వివరించారు.రైతులకు అవసరమైన మేరకు యూరియా నిల్వలు సిద్ధంగా ఉన్నాయని, అపోహలకు లోనుకాకుండా అవసరమైన పరిమాణంలో మాత్రమే ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. మట్టి పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగిస్తే ఖర్చులు తగ్గి పంటలకు మెరుగైన ఫలితాలు లభిస్తాయని తెలిపారు.ఈ సందర్భంగా నిర్వహిస్తున్న విత్తనాల మేళాలో వివిధ కంపెనీలకు చెందిన నాణ్యమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంటాయని, గ్రామీణ ప్రాంతాల రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సాగుకు అనువైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని బాబు నాయక్ కోరారు.“శాస్త్రీయ సాగు విధానాలు పాటిస్తూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటే ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఆశించిన దిగుబడులు, ఆదాయం సాధించగలరు” అని ఆయన పేర్కొన్నారు.

# వందల కోట్ల 'రావల్కోల్' భూదందా

- సర్కార్ భూమి మంత్రులకు ఇనామ్
- పచ్చిక బయళ్లపై పెద్ద 'పెద్దల' కన్ను
- రిటైర్మెంట్‌కు మూడు రోజుల ముందు ఆర్డీవో జెట్ స్పీడ్ ఆర్డర్
- మంత్రి పేషీ స్కెచ్.. ఆర్డీవో 'రాజకీయ' విన్యాసాలు
- గతంలో రంగంలోకి దిగి భూమిని స్వాధీనం చేసుకున్న ఎమ్మార్వో పద్మశ్రీ


276 ఎకరాల భూమి స్వాధీనం: ఎమ్మార్వో



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) అది ఎకరమో, రెండెకరాలో కాదు.. ఏకంగా 276 ఎకరాల ఆరు గుంటల మహా సామ్రాజ్యం. దాని మార్కెట్ విలువ అక్షరాలా వందల కోట్లు ఉంటుంది. దశాబ్దాలుగా ప్రభుత్వ రికార్డుల్లో పచ్చిక బయళ్లుగా ఉన్న భూమిపై అధికార పీఠానికి చెందిన 'పెద్దల' కన్ను పడింది. కంచె చేను మేసిన చందంగా నంబర్-2 మంత్రి పేషీ కేంద్రంగా, తెరవెనుక ముఖ్యనేత బంధువులు, ఇద్దరు మంత్రులు కలిసి కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే ఈ వేల కోట్ల విలువైన భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు పక్కా స్కెచ్ వేశారు. కానీ, ఈ భారీ భూకుంభకోణంపై తీవ్ర సంచలనం రేగడంతో మేడ్చల్ రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. వివాదాస్పద 276 ఎకరాల భూమిని పూర్తిగా ప్రభుత్వ భూమిగా ప్రకటిస్తూ దాన్ని నుంచి తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు గతంలో ఉన్న మేడ్చల్ ఎమ్మార్వో పద్మశ్రీ 21-04-2004 పత్రికా ప్రకటన ద్వారా సంచలన ప్రకటన చేశారు.

### పచ్చిక బయళ్లలో 'పెద్దల' మేత..

1954-55 ఖాస్రా పహాణీల రికార్డుల ప్రకారం, మేడ్చల్ మండలంలోని రావాల్కోల్ గ్రామంలో గల సర్వే నంబర్లు 4 నుండి 18, 20, 22, 25 లలోని భూమి 'ఇనామ్ భూమి'గా నమోదైనప్పటికీ, దాని స్వభావం కంచ-గ్రేజింగ్ ల్యాండ్స్ అంటే శాశ్వత పచ్చిక బయళ్లుగా ఉంది. 1997లో కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఈ భూములకు ఓఆర్సీలు (ఆక్యుపెన్సీ రైట్ సర్టిఫికెట్) పొందినా, 2003లో అప్పటి జాయింట్ కలెక్టర్ రవిచంద్ర వాటిని రద్దు చేశారు. పచ్చిక బయళ్లు సాగుకు యోగ్యం కావు కాబట్టి 1955 ఇనామ్ రద్దు చట్టం ప్రకారం ఇవి ప్రభుత్వ భూములేనని స్పష్టం చేశారు. ఆ తర్వాత 2008లో హైకోర్టు కూడా ఇవి గ్రేజింగ్ ల్యాండ్స్ అయితే ప్రైవేట్ వ్యక్తులకు ఓఆర్సీలు ఇవ్వడానికి వీల్లేదని తేల్చి చెప్పింది.

### మంత్రి పేషీ స్కెచ్.. ఆర్డీవో 'రాజకీయ' విన్యాసాలు..



ఇంతటి స్పష్టమైన రికార్డులు ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ భూమిపై కొందరు మంత్రుల కన్ను పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కరీంనగర్‌కు చెందిన ఒక ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్రంలో నంబర్-2 గా ఉన్న ఒక ముఖ్య నేత, అలాగే ఒక టాప్ బిల్డర్ రంగంలోకి దిగి సెటిల్మెంట్‌కు తెరలేపారని ఈ భూమిని ప్రైవేట్ వ్యక్తుల పేరిట మార్చేందుకు కీసర ఆర్డీవోగా రాజేష్ కుమార్ అనే అధికారిని ప్రత్యేకంగా పోస్టింగ్ ఇప్పించుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది జనవరి 8న బాధ్యతలు చేపట్టిన ఆర్డీవో 1993 నాటి పాత ఫైలును తెరిచి కేవలం నెలన్నర రోజుల్లోనే ఐదు సార్లు విచారణ జరిపి రిజర్వ్ ఫర్ ఆర్డర్ లో పెట్టారు. తహసీల్దార్ కేవలం ఒక్క రోజులోనే రికార్డుల పరిశీలన పూర్తి చేసి మే 25న నివేదిక ఇస్తే.. ఆర్డీవో రాజేష్ కుమార్ తన పదవీ విరమణకు కేవలం మూడు రోజుల ముందు, అంటే మే 27న నిబంధనలను తుంగలో తొక్కి ఇనామ్‌దారులకు అనుకూలంగా ఓఆర్సీలు జారీ చేసేశారు. దీని వెనుక ప్రభుత్వ పెద్దలు తలా 50 ఎకరాల చొప్పున, అంటే ఒక్కొక్కరికి రూ. వందల కోట్ల వాటా పంచుకున్నట్లు రెవెన్యూ వర్గాల్లో బహిరంగ చర్చ నడుస్తోంది.

### రావల్కోల్‌లో 276 ఎకరాల భూమి ప్రభుత్వ ఆధీనంలోకి: నాటి ఎమ్మార్వో పద్మశ్రీ

మేడ్చల్ మండల పరిధిలోని రావల్కోల్ గ్రామంలో గల 276 ఎకరాల ఆరు గుంటల భూమిని ప్రభుత్వ భూమిగా పరిగణిస్తూ తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు నాటి మేడ్చల్ ఎమ్మార్వో పద్మశ్రీ విలేకరుల సమావేశంలో ప్రకటించారు. మండలంలోని రావల్కోల్ గ్రామంలో 4 నుండి 18, 20, 22, 25 సర్వేనెంబర్లలోని భూమి గతంలో ఇనాం భూమిగా పరిగణించబడేదని, దీన్ని తూర్పు డివిజన్ ఆర్డీఓ ప్రొసీడింగ్స్ నెం. జె/4810/93 నుండి జె/4815/93 వరకు ఇనాం రద్దుచేస్తూ ఆక్యుపెన్సీ రైట్స్ (రైతువారి పట్టా) మంజూరు చేశారని ఆమె తెలిపారు. అయితే అట్టి భూమిని జిల్లా జాయింట్ కలెక్టర్ 29-11-2003న ప్రొసీడింగ్ నెం. ఎఫ్1 4726/97 నుండి ఎఫ్1 4731/97 ద్వారా ఇనాం భూములను రద్దుచేసి, ప్రభుత్వ భూములుగా పరిగణనలోకి తీసుకుంటూ ఆదేశాలు జారీచేశారని పేర్కొన్నారు.

ఈ జేసీ ఆదేశాల మేరకు 21 ఏప్రిల్ 2004 రోజునే ఆ భూములను మేడ్చల్ ఎమ్మార్వో ఆధీనంలోకి తీసుకున్నట్లు ఆమె స్పష్టం చేశారు. పైన తెలిపిన సర్వేనెంబర్ల పరిధిలోని 276.6 ఎకరాల భూమిలో ఎవరైనా ఎలాంటి క్రయ విక్రయాలకు, లావాదేవీలకు పాల్పడినా, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. అమాయక ప్రజలను మోసం చేయడానికి కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రయత్నిస్తున్నారని, అందువల్ల ఇట్టి భూములను రిజిస్ట్రేషన్ చేయరాదని మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్‌కు కూడా ఆదేశాలు జారీచేసినట్లు ఆమె తెలిపారు. గ్రామంలో ఎవరైనా ఇట్టి భూములు అమ్మడానికి లేదా కొనడానికి ప్రయత్నించినా సంబంధిత గ్రామ కార్యదర్శి నుండి ముందస్తు అనుమతి తీసుకోవాలని, లేనిచో నిబంధనల ఉల్లంఘన కింద కార్యదర్శిపై కూడా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని నాటి ఎమ్మార్వో పద్మశ్రీ స్పష్టం చేశారు.

# మమతా బెనర్జీకి షాక్

- చైర్‌పర్సన్‌గా తొలగించిన రెబల్ వర్గం



కోల్కతా (ప్రశ్న న్యూస్) పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో పెను సంచలనం చోటుచేసుకుంది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీలో సంక్షోభం పతాక స్థాయికి చేరింది. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీని చైర్‌పర్సన్ పదవి నుంచి తొలగిస్తున్నట్లు ప్రతిపక్ష నేత, టీఎంసీ రెబల్ నాయకుడు రితబ్రత బెనర్జీ ప్రకటించారు. అసలైన టీఎంసీ తమదేనని ఆయన స్పష్టం చేశారు. కోల్‌కతాలోని న్యూటౌన్‌లో గల ఒక ఫైవ్‌స్టార్ హోటల్‌లో సోమవారం ఈ వర్గం సమావేశమైంది. ఈ సందర్భంగా సీనియర్ ఎమ్మెల్యే అరూప్ రాయ్‌ను కొత్త చైర్‌పర్సన్‌గా వాయిస్ ఓటు ద్వారా ఎన్నుకున్నారు. పార్టీ నిర్వహణ కోసం 30 మంది సభ్యులతో కూడిన ఒక కమిటీని కూడా నియమించారు. ఒకప్పుడు మమతకు అత్యంత సన్నిహితుడైన ఫిర్హాద్ హకీమ్‌తో పాటు అరూప్ బిశ్వాస్, రతిన్ ఘోష్, సబినా యాస్మిన్‌లను వైస్ చైర్‌పర్సన్‌లుగా నియమించారు. రితబ్రత బెనర్జీ, జావేద్ ఖాన్, సందీపన్ సాహాలను ప్రధాన కార్యదర్శులుగా ప్రకటించారు. తమకు 60 మంది ఎమ్మెల్యేలు, 70 మంది మాజీ కౌన్సిలర్ల మద్దతు ఉందని వారు వెల్లడించారు. ఇదే క్రమంలో మమత మేనల్లుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీని కూడా ఈ వర్గం పార్టీ నుంచి సస్పెండ్ చేసింది.

# అమ్మ క్యాన్సర్ బాధ నుంచే బసవతారకం ఆసుపత్రి ఆలోచన

- నందమూరి బాలకృష్ణ భావోద్వేగం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ ఒక్కరూ క్యాన్సర్ చికిత్సకు దూరం కాకూడదనే ఉద్దేశంతోనే బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభమైందని ఆసుపత్రి ఛైర్మన్, నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆసుపత్రి రజతోత్సవ వేడుకల్లో ఆయన ఒక కొడుకుగా భావోద్వేగంతో మాట్లాడారు. తన తల్లి బసవతారకం క్యాన్సర్ బారిన పడినప్పుడు పడిన బాధను గుర్తుచేసుకుంటూ డబ్బు ఉన్నవారు ఎలాగోలా ట్రీట్మెంట్ చేయించుకోగలరని, మరి లేనివారి పరిస్థితి ఏంటన్న ఆమె ప్రశ్న నుంచే ఈ బసవతారకం ట్రస్ట్ పుట్టిందని తెలిపారు. అప్పట్లోనే దేశంలోనే మొట్టమొదటి బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ కేంద్రాన్ని ఇక్కడ ప్రారంభించామని తెలిపారు. ప్రస్తుతం రోజుకు 35 నుండి 40 శస్త్రచికిత్సలు చేస్తూ వేలాది మందికి ఈ ఆసుపత్రి ఆశాకిరణంగా మారిందన్నారు. ఈ కార్యక్రమానికి చెప్పారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్‌లో సేవలను మరింత విస్తరించడంతో పాటు, త్వరలోనే అమరావతిలో కూడా బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిని నిర్మిస్తామని బాలకృష్ణ ఈ వేదికగా ప్రకటించారు. అమరావతిలో గత ఏడాది ఆగస్టులో బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ నిర్మాణానికి భూమి పూజ చేయడం తెలిసిందే. బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ రజతోత్సవ వేడుకలకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్రమంత్రులు అనుప్రియ పటేల్, పెమ్మసాని చంద్రశేఖర్, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, తెలంగాణ మంత్రి దామోదర రాజనర్సింహ, ఏపీ మంత్రి సత్యకుమార్‌తో పాటు టాలీవుడ్ ప్రముఖులు, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలకృష్ణ టాలీవుడ్ డైరెక్టర్లు, నిర్మాతలను పేరుపేరునా చంద్రబాబుకు ఆప్యాయంగా పరిచయం చేయడం హైలైట్‌గా నిలిచింది. డైరెక్టర్లు బోయపాటి శ్రీను, కొరటాల శివ, బాబీ కొల్లి, గోపీచంద్ మలినేని, అనిల్ రావిపూడితో పాటు టాలీవుడ్ నిర్మాతలు వెంకట్ సతీష్ కిలారు, సాహు గారపాటి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. భయం ధైర్యంగా మారడమే తమ సక్సెస్ అని, క్యాన్సర్ పేషెంట్స్ చిరునవ్వే తమ నిజమైన విజయంగా బాలకృష్ణ అభివర్ణించారు. ఈ ఆసుపత్రి ద్వారా ఇప్పటివరకు 3.75 లక్షల మందికి పైగా ఓపీ సేవలు అందించామని, దాతలు, ప్రభుత్వాల సహకారంతోనే 25 ఏళ్ల క్రితం చేసిన ప్రమాణాన్ని నిలబెట్టుకున్నామని హర్షం వ్యక్తం చేశారు.

# నీటి వాటాపై రాజీపడే ప్రసక్తే లేదు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్రాష్ట్ర జల వివాదాలపై ఫోకస్ పెట్టింది. సచివాలయంలో నీటిపారుదల శాఖ ఉన్నతస్థాయి అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈరోజు అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్), తుంగభద్ర డ్యామ్ పరిధిలో తెలంగాణకు రావాల్సిన కృష్ణా నదీ జలాల వాటాపై ఈ మీటింగ్‌లో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆర్డీఎస్ కింద తెలంగాణకు చట్టబద్ధంగా కేటాయించిన నీటి వాటా విషయంలో ఎవరితోనూ రాజీపడే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలోని తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తుంగభద్ర జలాల వినియోగంలో ఎగువ రాష్ట్రాలు (కర్ణాటక, ఏపీ) తీసుకునే ఏకపక్ష నిర్ణయాల వల్ల తెలంగాణ రైతులకు నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ట్రైబ్యునళ్లు, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, అంతర్రాష్ట్ర సమావేశాల వేదికగా తెలంగాణ హక్కులను చాలా బలంగా వినిపించాలని స్పష్టం చేశారు. కృష్ణా పరీవాహక ప్రాంత రైతుల సాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశిస్తూ.. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్నైనా తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. ఈ అంతర్రాష్ట్ర జల వివాదాలపై చట్టపరమైన, సాంకేతిక, పరిపాలనా అంశాలతో కూడిన ఒక సమగ్ర నివేదికను వెంటనే సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

# అంధకారంలో రైల్వే కాలనీలోని 150 కుటుంబాలు

- వీధి దీపాల్లేక కాలనీవాసుల నరకయాతన
- చీకట్లను ఆసరాగా చేసుకుని రెచ్చిపోతున్న దొంగలు, అసాంఘిక శక్తులు
- పట్టించుకోని అధికారులు - పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందన శూన్యం: విజయమేరీ, అడ్వకేట్


SAI DURGA RAILWAY COLONY WELFARE ASSOCIATION

Thanking you,

Yours faithfully,

President /General Secretary
Sai Durga Medchal Railway Colony Association
Ward No. 10, Medchal

Sub-Inspector of Police
Medchal Police Station
Cyberabad Commissionerate

మేడ్చల్ (ప్రశ్న న్యూస్) అభివృద్ధి మాట ఎలా ఉన్నా, కనీస అవసరమైన వీధి దీపాలు లేక ఓ కాలనీ మొత్తం చీకట్లలో మగ్గిపోతోంది. జీహెచ్ఎంసీ డివిజన్ నెంబర్ 297 పరిధిలోని రైల్వే కాలనీ గత కొన్నేళ్లుగా అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. సుమారు 150 కుటుంబాలు నివసిస్తున్న ఈ కాలనీలో గత కొన్ని సంవత్సరాలుగా కనీసం ఒక్క వీధి లైటు కూడా సరిగ్గా వెలగడం లేదు. దీంతో రాత్రి అయిందంటే చాలు కాలనీవాసులు గుండెల్లో బెదురుతో కాలం వెళ్లదీస్తున్నారు.


### చీకటిని ఆసరాగా చేసుకుని దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు..

కాలనీలో వీధి దీపాలు లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని దొంగలు, అసాంఘిక శక్తులు రెచ్చిపోతున్నారు. వరుస దొంగతనాలతో స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో కనీసం నడవడానికి కూడా వీల్లేని పరిస్థితి నెలకొందని, చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాముల భయం ఒకపక్క, మద్యం ప్రియుల విచ్చలవిడితనం ఇంకోపక్క కాలనీవాసుల నిద్రను దూరం చేస్తున్నాయి. ఎక్కడపడితే అక్కడ మద్యం సేవించి స్థానికులను ఇబ్బంది పెట్టడంతోపాటు, స్థానిక 'అలేఖ్య వెంచర్' లో విచ్చలవిడిగా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు.

### డిప్యూటీ కమిషనర్ సాబ్ ఇకనైనా స్పందించండి..

ఈ తీవ్రమైన సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని కాలనీ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మేడ్చల్ సర్కిల్ కార్యాలయ ఉన్నతాధికారులు, డిప్యూటీ కమిషనర్ వెంటనే స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు. వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, కాలనీలో కొత్త వీధి దీపాలను ఏర్పాటు చేయాలని, అలాగే రాత్రి వేళల్లో పోలీస్ పెట్రోలింగ్ పెంచి తమకు దొంగల భయం, అసాంఘిక శక్తుల వేధింపుల నుండి కాపాడాలని కాలనీ ప్రజలు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.





### పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందన శూన్యం:విజయమేరీ, అడ్వకేట్

కాలనీలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలపై గతంలోనే మేడ్చల్ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాం. అయినప్పటికీ ఇప్పటివరకు కనీసం ఏ ఒక్క అధికారి కూడా ఇటువైపు వచ్చి పరిశీలించలేదు, ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588